




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 297 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం బుధవారం 2 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 297 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM WED 2 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట

- శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ కేసులో రంగనాథ్‌ను కమిషనర్‌గా తొలగించాలన్న సింగిల్ బెంచ్
- సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేసిన రంగనాథ్
- విచారణ చేపట్టి, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్

పెన్ పవర్ డెస్క్:హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. రంగనాథ్‌ను కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించాలంటూ సింగిల్ జడ్జి

- మిగతా 2లో

## సింధు జలాల వివాదం.. నీటిని ఆయుధంగా వాడొద్దన్న పాకిస్థాన్ ప్రధాని

- ఎస్‌సీఓ సదస్సులో సింధు జలాల ఒప్పందంపై పాక్ ప్రధాని ప్రస్తావన
- నీటిని రాజకీయ ఆయుధంగా వాడరాదని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్య
- హేగ్ మధ్యవర్తిత్వ కోర్టు తీర్పును తీవ్రంగా వ్యతిరేకించిన భారత్
- పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఒప్పందాన్ని నిలిపివేసినట్లు స్పష్టం చేసిన ఇండియా

- మిగతా 2లో



## స్థానిక సంస్థల ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకోవాలి

- ప్రతి స్థానంలో పోటీకి సిద్ధం కావాలి.
- ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా కార్యాచరణ రూపొందించాలి.
- అధికార బలం, పోలీసుల ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి.
- కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని జగన్ భరోసా.
- వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన మేలును ప్రతి ఇంటికీ వివరించాలి.
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి.
- ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాలి.
- గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి.



పెన్ పవర్ డెస్క్:స్థానిక సంస్థల ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకుని ప్రతి స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పోటీ చేసేలా ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

- మిగతా 2లో



## పాక్ దుర్బుద్ధి.. మోదీ లేకుండా ఎస్‌సీఓ గ్రూప్ ఫొటో

- గ్రూప్ ఫొటో నుంచి మోదీని పాక్ తొలగించింది
- రౌండ్‌టేబుల్ వీడియోలోనూ మోదీ భాగాన్ని ఎడిట్ చేసింది
- పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఖాతాల్లో ఫొటో, వీడియో షేర్
- మోదీ మాత్రం పూర్తి గ్రూప్ ఫొటోను షేర్ చేశారు
- ఉగ్రవాదం వ్యూహాత్మక సంపద కారాదని మోదీ స్పష్టం చేశారు
- పాక్ చర్యలపై నెటిజన్ల విమర్శలు

- మిగతా 2లో



# ఉత్తరాంధ్ర చరిత్రలో అపురూప ఘట్టం..

### నేడు పాయకరావుపేటలో గోదావరి జలాలకు సీఎం చంద్రబాబు జల హారతి

- పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు
- నేడు పాయకరావుపేటలో జలాలకు హారతి ఇచ్చి విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు
- 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందించే లక్ష్యం
- నాలుగు నదులు, తూర్పు కనుమలు దాటుతూ సాగిన కాలువ నిర్మాణం
- భవిష్యత్తులో ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానం చేసి 8 లక్షల ఎకరాలకు నీరు

- మిగతా 2లో

# బటన్ నొక్కడం కాదు..

## ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నాం

- మొగల్తూరులో చంద్రబాబు సభ
- పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడి
- మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, డ్వాక్రా సంఘాలకు ప్రోత్సాహం అందిస్తామని హామీ
- నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే తన ఆశయమని స్పష్టీకరణ
- పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా



పెన్ పవర్ డెస్క్:"గత పాలకులు బటన్ నొక్కి చేతులు దులుపుకొన్నారు, రోడ్ల నిండా గుంతలు పెట్టారు. కానీ మేం అలా కాదు.. ప్రతి అవ్వాతాత ఇంటికి వచ్చి వారికి గౌరవంగా పెన్షన్ అందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు సూత్రాలతో ముందుకు సాగుతోందని ఆయన పునరుద్ఘాటించారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గంలోని మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన 'పేదల సేవలో ప్రజా వేదిక' కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని ఆయన ప్రారంభించి ప్రసంగించారు.

గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఉండేదని, తమ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికిందని చంద్రబాబు అన్నారు. వాలంటీర్ వ్యవస్థను దుర్వినియోగం చేసిన గత పాలకుల తీరును ఆయన తప్పుబట్టారు. ఇప్పుడు తాము నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి, పెంచిన పెన్షన్లను అందిస్తూ వారి ఆత్మగౌరవాన్ని నిలబెడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న చంద్రబాబు, 31 ఏళ్ల క్రితం ఇదే రోజు (సెప్టెంబరు 1) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేశానని, అప్పటి నుంచి ప్రజా చైతన్యం, ప్రజా భాగస్వామ్యమే ధ్యేయంగా పనిచేస్తున్నానని తెలిపారు. ఇప్పటివరకు పెన్షన్ల రూపంలో రూ.73,507 కోట్లు అందించామని, గత రెండేళ్లలో సంక్షేమ పథకాల

- మిగతా 2లో

## విజయసాయిరెడ్డిని సజ్జల కొట్టింది నిజమే

పెన్ పవర్ డెస్క్:'దేశవిదేశాల నుంచి ఆంధ్రులు వచ్చి ఓట్లు వేసి కూటమిని గెలిపించారు. కూటమి ప్రభుత్వ ఘనవిజయం ఒకచరిత్ర.. వైకాపా ఘోర పరాజయం కూడా చారిత్రకఘట్టం' అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియా మాట్లాడుతూ.. కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ వైకాపా వికృత రాజకీయం చేస్తుందన్నారు. హిందూ మతానికి ఘోర

- మిగతా 2లో



## అక్షర ఆంధ్రకు అద్భుత ఫలితాలు..

### వచ్చే సెప్టెంబరుకు 100 శాతం అక్షరాస్యత:

- పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష
- వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనకు పక్కా ప్రణాళికలు
- అక్షర ఆంధ్ర కార్యక్రమంతో ఏడాదిలో 25 లక్షల మందికి అక్షరజ్ఞానం
- బడిబయట ఉన్న 1.64 లక్షల మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశం
- మధ్యాహ్న భోజనంపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని తల్లిదండ్రులకు, టీచర్లకు సూచన
- ఇంటర్ విద్యార్థులకు 'తల్లికి వందనం' కింద రూ.1051 కోట్ల ఆర్థిక సాయం

- మిగతా 2లో



## రైతు ఇంటికి సీఎం విజయ్.. బామ్మకు సర్‌ప్రైజ్ గిఫ్ట్

- సేలం జిల్లాలో తమిళనాడు సీఎం విజయ్ పర్యటన
- రైతు ఇంట్లో ఆకస్మికంగా ఆగిన ముఖ్యమంత్రి
- సీఎంను చూసి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైన బామ్మ
- తన కళ్లజోడును బామ్మకు బహుమతిగా ఇచ్చిన విజయ్

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పర్యటనలో ఒక రైతు కుటుంబానికి అనూహ్య రీతిలో ఆశ్చర్యాన్ని కలిగించారు. మంగళవారం సేలం జిల్లాలో పర్యటించిన ఆయన, ఒక గ్రామంలో ఆకస్మికంగా

- మిగతా 2లో



## ల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అమలుకు లైన్ క్లియర్..

- కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే ఎత్తివేసిన హైకోర్టు
- తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు
- సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసిన ధర్మాసనం
- ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో జోక్యంపై కీలక వాదనలు
- పథకాల అమలుకు తొలగిన అడ్డంకులు

- మిగతా 2లో




## 1,000 దాటిన మరణాలు.. 700 మృతదేహాలు సామూహిక ఖననం

పెన్ పవర్ డెస్క్:నేపాల్ వరదల్లో గల్లంతైన వారి కోసం ఆరో రోజూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటివ రకు 1003 మృతదే హాలను సహాయక బృందాలు వెలికితీశాయి. సుమారు 4వేల మంది ఆచూకీ ఇంకా లభించలేదు.

- మిగతా 2లో



# బటన్ నొక్కడం కాదు..
# ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నాం

- మొదటి పేజీ తరువాయి
కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని వివరించారు.
మహిళా సాధికారత నుంచి సామాజిక న్యాయం వరకు
మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చంద్రబాబు అన్నారు. పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టిన డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా నిలబెట్టామని, ఇప్పుడు 'దీపం-2.0' పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి వారిని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, ఈ లక్ష్యాన్ని మరింత పెంచుతామని, వారు తయారు చేసే ఉత్పత్తులకు 'స్వయం' బ్రాండ్‌తో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే 'స్త్రీశక్తి' కార్యక్రమం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి వారిపై ఆర్థిక భారం తగ్గించామని అన్నారు.
సంక్షేమం అంటే కేవలం డబ్బులు పంచడం కాదని, అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధిలోకి తీసుకురావడమేనని సీఎం పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లో ఇంకా ఉన్న వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసి సామాజిక న్యాయం చేశామని గుర్తుచేశారు.

**అభివృద్ధి, సాంకేతికతతో నవశకం**

నదుల అనుసంధానంతో రాష్ట్రంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కరవు నేలకు కృష్ణా జలాలు అందించామని, శ్రీశైలం నుంచి మార్కాపురం వరకు నీళ్లు పారించడం తన జీవితంలో ఎనలేని ఆనందాన్ని ఇచ్చిందన్నారు. రేపు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించబోతున్నామని, గోదావరి నీటిని అనకాపల్లి, విశాఖ మీదుగా వంశధార వరకు తీసుకెళ్తామని ప్రకటించారు.
గత పాలకులు పరిశ్రమలను తరిమేసి యువత భవిష్యత్తును అంధకారం చేశారని విమర్శించారు.
తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని, విద్యుత్ సంస్థలను సమర్థంగా నిర్వహిస్తూ 'ట్రూ డౌన్' ద్వారా ఛార్జీల భారాన్ని తగ్గించామని తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ.1.5కే అందిస్తున్నామని, ప్రపంచ మార్కెట్లో ఏపీ ఆక్వా ఉత్పత్తులను అగ్రస్థానంలో నిలుపుతామని అన్నారు. ప్రజా పాలనలో సాంకేతికతను విరివిగా ఉపయోగిస్తామని, ఏఐ ట్యూటర్, ఏఐ డాక్టర్ వంటి వ్యవస్థలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని, 1.60 కోట్ల కుటుంబాలకు ఆన్‌లైన్‌లోనే ప్రభుత్వ సేవలు అందించే వ్యవస్థను రూపొందిస్తామని వెల్లడించారు. నర్సాపురం అభివృద్ధికి ఆక్వా కల్చర్ యూనివర్సిటీ, డంప్ యార్డు, డెల్టా ఆధునికీకరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

**ఏకగ్రీవాలు వద్దనడం వారి ఓటమి భయానికి నిదర్శనం**

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏ కూటమిదే విజయమని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే 'గొడ్డలి పార్టీ' స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకునేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఏకగ్రీవాలను వద్దనడం వారి ఓటమి భయానికి నిదర్శనమని, గతంలో ప్రభుత్వాలే ఏకగ్రీవాలను ప్రోత్సహించాయని గుర్తుచేశారు. ఆయారాం-గయారాంలను అరికట్టేందుకు మేయర్, చైర్మన్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో పెట్టామని తెలిపారు. బీసీ రిజర్వేషన్లను కూడా తగ్గించి ఆ వర్గాలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడిటర్ వ్యూ

### సింధు జలాల వివాదం..
### నీటిని ఆయుధంగా వాడొద్దన్న పాకిస్థాన్ ప్రధాని

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు వేదికగా భారత్-పాకిస్థాన్ మధ్య సింధు జలాల ఒప్పందం వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. మంగళవారం ఈ అంశాన్ని ప్రస్తావించిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, నీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ అస్త్రంగా మలుచుకోకూడదని భారత్‌ను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ ఒప్పందాలను వాటి అసలు స్ఫూర్తికి అనుగుణంగా అమలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హేగ్‌లోని శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం సింధు జలాల ఒప్పందం చెల్లుబాటును సమర్థిస్తూ, వివాద పరిష్కార యంత్రాంగం కొనసాగుతుందని తీర్పు వెలువరించిన మరుసటి రోజే షెహబాజ్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ న్యాయస్థానం తీర్పును భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. అసలు, ఆ కోర్టు ఏర్పాటే చట్టవిరుద్ధమని, దాని పరిధిని తాము గుర్తించబోమని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. సదరు ట్రైబ్యునల్ విచారణలో భారత్ పాల్గొనలేదని, ఆ తీర్పులు తమ జలవిద్యుత్ ప్రాజెక్టులపై ఎలాంటి ప్రభావం చూపబోవని తేల్చిచెప్పింది. 2025 ఏప్రిల్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. తాజా తీర్పు వెలువడినప్పటికీ, ఈ విషయంలో తన వైఖరిలో ఎలాంటి మార్పు లేదని భారత్ పునరుద్ఘాటించింది. ఇదే ఎస్‌సీఓ సదస్సులో ప్రసంగించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఉగ్రవాదంపై పోరాటంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించడం తగదని హెచ్చరించారు. ఉగ్రవాదానికి అందుతున్న నిధులు, నియామకాలు, సురక్షిత స్థావరాలను కూకటివేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. ఈ పరిణామాలతో భారత్-పాకిస్థాన్ మధ్య ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్తతల మధ్య సింధు జలాల వివాదం మరోసారి కీలక అంశంగా మారింది.

## హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట

- మొదటి పేజీ తరువాయి
ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, లోతుకుంట గ్రామంలోని సర్వే నెంబర్లు 1, 2లలో ఉన్న సుమారు 40 ఎకరాల భూమిలో ఈ నెల 17న అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ఈ చర్యను సవాలు చేస్తూ శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా గతంలో సింగిల్ జడ్జి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.
కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించే అధికారులు చట్టబద్ధమైన పాలనకు ప్రమాదకరమని, అలాంటి వ్యక్తులు బాధ్యతాయుతమైన పదవుల్లో కొనసాగకూడదని సింగిల్ జడ్జి అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్లలో 9,290 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా, కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఒక్క రంగనాథ్‌పైనే 63 కేసులు నమోదు కావడం అసాధారణమని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అయితే, సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రంగనాథ్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, తాజాగా డివిజన్ బెంచ్ ఆ తీర్పును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

## స్థానిక సంస్థల ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకోవాలి

- మొదటి పేజీ తరువాయి
ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా గ్రామాలు, వార్డుల వారీగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. పులివెందుల పర్యటనలో భాగంగా భాకరాపురం క్యాంప్ కార్యాలయంలో వైఎస్ జగన్ ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు, వినతులను ఆయన ఓపికగా విన్నారు. అనంతరం పార్టీ నాయకులతో మాట్లాడి స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. అధికార బలం, పోలీసులను అడ్డుపెట్టుకుని ఒత్తిళ్లు, దౌర్జన్యాలకు పాల్పడితే ధైర్యంగా, సంఘటితంగా ఎదుర్కోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు జరిగిన మేలును ప్రతి ఇంటికీ వివరించాలని జగన్ సూచించారు. గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ, నాడు--నేడు, ఆరోగ్యశ్రీ, రైతులు, మహిళలు, విద్యార్థులు, పేదలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలపై నిరంతరం పోరాడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను విజయవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## విజయసాయిరెడ్డిని సజ్జల కొట్టింది నిజమే

- మొదటి పేజీ తరువాయి
అన్యాయం జరిగిందని ఎలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆలయాల్లో రథాలు తగులబడినప్పుడు, విగ్రహాల తలలు తెగ్గొట్టినప్పుడు, సింహాలు చోరీకి గురైనప్పుడు వైకాపా నేతల నోళ్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఏపీని అస్థిరం చేయాలని ఓ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పరిశ్రమలు, పెట్టుబడులు రాకూడదని ఫేక్ వీడియోలతో ప్రచారాలు చేస్తే.. చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వైకాపా క్రెడిట్ చోరీ చూస్తుంటే నాగార్జునసాగర్, సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టులు కట్టింది జగన్ అని చెప్పేట్టు ఉన్నారని ఎద్దేవా చేశారు. "విజయసాయిరెడ్డి నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు ఎంత నీచంగా, ఘోరంగా మాట్లాడారో అందరికీ తెలుసు. విజయసాయిని సజ్జల కొట్టింది నిజమే. మంగళగిరిలో ప్లీనరీ జరిగేటప్పుడు వేదికపై ఎవరితో మాట్లాడించాలనే దానిపై ఇద్దరి మధ్య వివాదం తలెత్తి, మాటామాటా పెరిగి కొట్టింది వాస్తవమే. విజయసాయిరెడ్డి 72 అవమానాలు జరిగాయని చెప్పారు. నాకు ఒక్కడికే తెలిసి మరో ఘోర అవమానం జరిగింది. తన సొంతూరైన తాళ్లపూడికి వచ్చినప్పుడు.. కాకుపల్లి సెంటర్‌లో వంద వాహనాలతో ఘనంగా స్వాగతం పలికారు. దానిపై విజయసాయిని సజ్జల నీచాతినీచంగా దూషించారు. ఆ మాటలు నా నోటితో నేను చెప్పలేను" అని కోటంరెడ్డి అన్నారు.

## రైతు ఇంటికి సీఎం విజయ్.. బామ్మకు సర్‌ప్రైజ్ గిఫ్ట్

- మొదటి పేజీ తరువాయి
ఆగి స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఒక వృద్ధురాలు చూపిన ఆత్మీయతకు ముగ్ధుడైన ఆయన, తాను ధరించిన కళ్లజోడును ఆమెకు బహుమతిగా అందించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సేలం జిల్లాలోని మెట్టూరు డ్యామ్ గేట్లను తెరిచి, సాగునీటిని విడుదల చేసే క్రమంలో ముఖ్యమంత్రి విజయ్ అక్కడికి చేరుకున్నారు. కార్యక్రమం ముగించుకుని చెన్నైకి తిరుగుప్రయాణమైన ఆయన, మార్గమధ్యలోని చిన్నకావూరు గ్రామం వద్ద తన కాన్వాయ్‌ను నిలిపివేశారు. నేరుగా రామస్వామి అనే రైతు నివాసానికి వెళ్లి ఆ కుటుంబ సభ్యులను పలకరించారు. ముఖ్యమంత్రి స్వయంగా తమ ఇంటికి రావడంతో ఆ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షాతిరేకలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఒక వృద్ధురాలు ముఖ్యమంత్రిని చూడగానే అమితానందానికి లోనయ్యారు. ఆత్మీయంగా ఆయన్ను ఆలింగనం చేసుకుని, చేతిని గట్టిగా పట్టుకుని తన అనురాగాన్ని చాటుకున్నారు. అనంతరం తన పెరట్లోని తోటను ఆయనకు చూపించారు. ఆమె అభిమానానికి చలించిన విజయ్, తక్షణమే తాను ధరించిన కళ్లజోడును తీసి ఆమెకు బహుమతిగా ఇచ్చారు. ఆ తర్వాత గ్రామంలోని వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేసి అక్కడి నుంచి నిష్క్రమించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, విజయ్ ఆ బామ్మకు బహూకరించిన సన్ గ్లాసులు వరల్డ్ క్లాస్ సంస్థ 'క్రిస్టియన్ డయోర్' తయారు చేసినవి. వీటి ధర రూ.50 వేలకు పైనే ఉంటుంది.

### ఉత్తరాంధ్ర చరిత్రలో అపురూప ఘట్టం..నేడు పాయకరావుపేటలో
## గోదావరి జలాలకు సీఎం చంద్రబాబు జల హారతి

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల సాగునీటి కలను సాకారం చేస్తూ గోదారమ్మ ఆ ప్రాంతంలోకి అడుగుపెడుతోంది. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి జిల్లా వరకు పరుగులు పెడుతున్నాయి. నాలుగు నదులను, తూర్పు కనుమల కొండలను దాటుకుని వస్తున్న ఈ జలధార, ఉత్తరాంధ్ర బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు సిద్ధమైంది. ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా, ముఖ్యమంత్రి చంద్రబాబు (సెప్టెంబరు 2) అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో గోదావరి జలాలకు 'జల హారతి' ఇచ్చి లాంఛనంగా విడుదల చేయనున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఈ ఏడాదిలోనే అనకాపల్లికి నీళ్లు అందించి, కూటమి ప్రభుత్వం తన సంకల్పాన్ని నిలబెట్టుకుంది.
మంగళవారం మధ్యాహ్నం 2:20 గంటలకు పాయకరావుపేటకు చేరుకోనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కాలువపై నిర్మించిన రెగ్యులేటర్‌ను ప్రారంభించి నీటిని విడుదల చేస్తారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంతో ఉత్తరాంధ్ర సాగునీటి చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభం కానుంది.

**కొండలు, నదులు దాటిన ఇంజనీరింగ్ అద్భుతం**

గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించడం అనేది ఒక గొప్ప ఇంజనీరింగ్ అద్భుతం. ఈ ప్రయాణంలో పంపా, తాండవ, వరాహ, శారద వంటి నాలుగు నదులను, ఏలేరు కాలువను, తూర్పు కనుమలను దాటాల్సి వచ్చింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4,192 కోట్లు వెచ్చించి అధునాతన సాంకేతికతతో నిర్మాణాలు చేపట్టింది. కొన్నిచోట్ల నదుల ప్రవాహానికి ఎగువన అక్విడెక్టులు, మరికొన్ని చోట్ల ప్రవాహానికి దిగువన సైఫన్లు నిర్మించారు. ముఖ్యంగా ఏలేరు నది గర్భం కింద నుంచి గోదావరి నీటిని తరలించేందుకు సైఫన్‌ను, పంపా నదిపై 30 మీటర్ల లోతు పునాదులతో భారీ అక్విడెక్టును నిర్మించారు. 10,634 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకునేలా తాండవ నదిపై 447 మీటర్ల పొడవున అక్విడెక్టు నిర్మాణం చేపట్టడం ఈ ప్రాజెక్టు సంక్లిష్టతకు నిదర్శనం.

**లక్షల ఎకరాలకు భరోసా.. భవిష్యత్తుకు మార్గం**

ప్రస్తుతం విడుదల చేస్తున్న నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 5.23 లక్షల మందికి తాగునీరు అందనుంది. ఒక్క అనకాపల్లి జిల్లాలోనే 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం కలగనుంది. దీంతోపాటు జిల్లాలోని 110 చెరువులను నింపేందుకు జలవనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. పుష్కర ఆయకట్టు కింద 1.48 లక్షల ఎకరాలు, ఏలేరు కింద 80 వేల ఎకరాలు, పంపా, తాండవ, వరాహ తదితర ఆయకట్టుల కింద మరో 58,000 ఎకరాలకు పైగా భూమి స్థిరీకరణ జరగనుంది.
వచ్చే ఏడాది నాటికి ఈ జలాలను విశాఖపట్నం వరకు పొడిగించి, ఆపై ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. 213 కిలోమీటర్ల పొడవైన ఈ ఎడమ కాలువ ద్వారా మొత్తం 23.44 టీఎంసీల నీటిని వినియోగంలోకి తెస్తారు. ఈ బృహత్తర ప్రణాళిక పూర్తయితే అనకాపల్లి, విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలతో సహా మొత్తం 8 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అంది, ఉత్తరాంధ్ర స్వరూపమే మారిపోనుంది.

## అక్షర ఆంధ్రకు అద్భుత ఫలితాలు..
## వచ్చే సెప్టెంబరుకు 100 శాతం అక్షరాస్యత:

రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసి, సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందని, దీని ద్వారా వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి రాష్ట్రాన్ని వంద శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా నిలపాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేశ్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థలో చేపడుతున్న సంస్కరణలు, కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు.
ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... 2024 నాటికి రాష్ట్ర అక్షరాస్యత శాతం కేవలం 72.6 శాతంతో దేశంలోనే అట్టడుగున ఉందని, అయితే గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కేవలం ఒక్క ఏడాదిలోనే 25 లక్షల మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారని తెలిపారు. ఈ కృషిని కేంద్ర ప్రభుత్వం కూడా అభినందించిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన వయోజన విద్య పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర అక్షరాస్యత శాతం 10 శాతం పెరిగి 82.1 శాతానికి చేరుకుందని, ఇదే స్ఫూర్తితో 2027 సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, ఆపై సెప్టెంబర్ నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. 11 ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ బృహత్ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు.

**బడిబయట పిల్లలందరినీ బడిలో చేర్పించాలి**

పాఠశాల విద్యపై సమీక్షిస్తూ, రాష్ట్రంలో బడిబయట ఉన్న 1,64,821 మంది పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటికే 33 వేల మందిని పాఠశాలల్లో చేర్పించామని, మిగిలిన వారి వివరాలను 'లీప్' యాప్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు పంపామని పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. పిల్లలను బడికి పంపేలా తల్లిదండ్రులను చైతన్యవంతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల హాజరు శాతం 98.97 శాతంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా పెంచాలని సూచించారు. వరుసగా మూడు రోజులు బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలని, ఈ బాధ్యతను పాఠశాల యాజమాన్య కమిటీలకు అప్పగించాలని స్పష్టం చేశారు.

**ఇంటర్ విద్యలో పురోగతి**

ఈ ఏడాది ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో మంచి ఉత్తీర్ణత సాధించామని, గత ఏడాదితో పోలిస్తే సుమారు 10 వేల అడ్మిషన్లు పెరిగాయని ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం 'సంకల్ప్ అకడమిక్ సపోర్ట్ ప్రోగ్రామ్' కింద ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఈ ఏడాది ఇంటర్ విద్యార్థులకు రూ.1051 కోట్లు అందించామని, మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా త్వరలో అందిస్తామని చెప్పారు. ఇంటర్ విద్యార్థులకు సంబంధించి నూరుశాతం అపార్ ఐడీ ఇంటిగ్రేషన్ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

**మధ్యాహ్న భోజనం నాణ్యతపై రాజీ లేదు**

మధ్యాహ్న భోజనం పథకం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నాణ్యతపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు 'లీప్' యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ అందించాలని కోరారు. అలాగే, విద్యార్థుల్లో ఒత్తిడి లేని అభ్యసన వాతావరణాన్ని కల్పించడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఏఐ టూల్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు 'ఏఐ సమర్థ్' కార్యక్రమం చేపడుతున్నామని, ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 192 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తామని అధికారులు తెలిపారు.
సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహణ, పదో తరగతి విద్యార్థుల కోసం 'మిషన్ మార్చి-2026'పై కూడా సమావేశంలో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా 125 కేంద్రాల్లో ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, పాఠశాల విద్య మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అమలుకు లైన్ క్లియర్..

తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో ఈ పథకాల కొనసాగింపునకు మార్గం సుగమమైంది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగనుంది.

## పాక్ దుర్బుద్ధి.. మోదీ లేకుండా ఎస్‌సీఓ గ్రూప్ ఫొటో

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా పాకిస్థాన్ మరోసారి వివాదాస్పదంగా వ్యవహరించింది. కిర్గిస్థాన్‌లో జరిగిన సదస్సులో పాల్గొన్న 10 సభ్య దేశాల నాయకులు కలిసి దిగిన గ్రూప్ ఫొటోను పాక్ ప్రధాని కార్యాలయం ఎక్స్‌లో షేర్ చేసింది. అయితే ఆ ఫొటో నుంచి భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు మరికొందరు నేతలను క్రాప్ చేసి తొలగించింది. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాత్రం దేశాధినేతల మధ్యలో ఉన్నట్లు ఫొటోలో కనిపించారు. ంతేకాకుండా ఎస్‌సీఓ నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశానికి సంబంధించిన వీడియోలోనూ మోదీ కనిపించే భాగాన్ని పాక్ ఎడిట్ చేసి తొలగించింది. మోదీ లేని ఆ వీడియోను షెహబాజ్ షరీఫ్ తన అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో షేర్ చేశారు. మరోవైపు ప్రధాని మోదీ మాత్రం సదస్సుకు హాజరైన అన్ని దేశాల అధినేతలు ఉన్న పూర్తి గ్రూప్ ఫొటోను తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. అందులో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా ఉన్నారు. దీంతో పాకిస్థాన్ తీరుపై నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. సదస్సులో ప్రధాని మోదీ పాకిస్థాన్‌పై పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని వ్యూహాత్మక సంపదగా ఉపయోగించరాదని స్పష్టం చేశారు. షెహబాజ్ షరీఫ్ సమావేశంలో ఉన్న సమయంలోనే మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## 1,000 దాటిన మరణాలు..
## 700 మృతదేహాలు సామూహిక ఖననం

- మొదటి పేజీ తరువాయి
వీరిలో 583 మంది విదేశీయులు, 83 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. ఇప్పటివరకు 12 వేల మందిని భద్రతా దళాలు రక్షించినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు, టిబెట్‌లో 16 మంది ప్రాణాలు కోల్పోగా.. 550 మంది ఆచూకీ లభించలేదని చైనా మీడియా పేర్కొంది.

**700 మృతదేహాలు ఖననం..**

ఆయా ప్రాంతాల్లో వెలికితీసిన మృతదేహాలను దేశవ్యాప్తంగా 21 ఆసుపత్రులకు తరలిస్తున్నారు. గల్లంతైన వారి ఫొటోలు పట్టుకొని బాధిత కుటుంబాలు వైద్య కేంద్రాల వద్ద వేచిచూస్తున్నాయి. మృతదేహాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాటిని భద్రపరిచేందుకు ఏర్పాట్లు లేక ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. అయితే, అవి గుర్తించలేని స్థితిలో ఉండటం, ఒక్కోచోట కొన్ని శరీర భాగాలు మాత్రమే లభ్యం అవుతుండడంతో అవి ఎవరివనేది నిర్ధరించడం సవాలుగా మారుతోంది. ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల్లో 60 మాత్రమే సంబంధిత కుటుంబాలకు అందజేయగా.. దాదాపు 700 మృతదేహాల నమూనాలను భద్రపరచిన అనంతరం వాటిని సామూహికంగా ఖననం చేశారు.

**ఆరు రోజుల్లో 100 రెస్క్యూ మిషన్లు.. ఎవరీ ప్రియా అధికారి?**
**రెస్క్యూలో వేలాది మంది..**

ప్రస్తుతం నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా నదుల్లో నీటి మట్టం పెరుగుతోంది. మరిన్ని వరదలు సంభవించవచ్చనే హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో దాదాపు 21వేల మంది భద్రతా సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో నిమగ్నమయ్యారు. హెలికాప్టర్ల సాయంతో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం.. రోడ్లు, వంతెనలు కూలిపోయిన ప్రాంతాల్లోని ప్రజలకు ఆహారం సరఫరా తదితర కార్యక్రమాలు చేపట్టారు.

# ఇంటింటికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ


**వై రామవరం/ గుర్తేడు, పెన్ పవర్, సెప్టెంబరు 1:** రెండు మండలాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 92 శాతం పైనే పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

వై రామవరం మండలంలో 1790 వివిధ రకాల పింఛన్లు ఉండగా మంగళవారం సాయంత్రానికి 1656 పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా గుర్తేడు మండలంలో 1331 పింఛన్లు ఉండగా 1187 పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. పింఛన్లు పంపిణీ దారులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.






# కార్పొరేషన్ ఎన్నికలు ఉంటాయో ? లేవో ?









- మేయర్ రేసులో అభ్యర్థులు !
- అధికారులు, ప్రజాప్రతినిధులు, నగర ప్రజల్లో సందేహాలు?
- సిటీ ఎమ్మెల్యే వైఖరి పై కూటమిలో అసంతృప్తి ?

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 1:**

**ఆలి లేదు సూలు లేదు**

కొడుకు పేరు సోమలింగ మటా ! సామెత లాగా రాజమహేంద్రవరం కార్పొరేషన్ కు ఎన్నికలు జరుగుతాయో లేదో కచ్చితంగా ప్రజాప్రతి నిధులు గాని, ప్రభుత్వాధి కారులు గాని చెప్పలేని సందిగ్ధత పరిస్థితి నెలకొంది. మూడుసార్లు జరిగిన మేయర్ ఎన్నికల్లో ఎస్ సి జనరల్, బీసీ మహిళ, ఓసి మహిళ రిజర్వేషన్లు జరిగితే ఈసారి రొటేషన్ ప్రకారం ఓసి నా ? అవుతుందా బీసీ నా? లేక మహిళ రిజర్వేషన్ అవుతుందా ? అన్నదానిపై స్పష్టత లేదు. 2011 జనాభా ప్రకారం ఎన్నికలు జరపాలా ! లేక 2026 జనవరిలో నిర్వహించిన జనగణన జనాభాను బట్టి ఎన్నికలు నిర్వహించాలా! స్పష్టత లేదు. మరొక సమస్య నగరాన్ని అనుకున్న సమీప గ్రామాలను విలీనం చేసి ఎన్నికల జరపాలా ? లేక కార్పొరేషన్ కు విడిగానే జరపాలా ? ఇలాంటి సంకట పరిస్థితుల్లో మేయర్ రేసులో నేనున్నానంటూ ప్రజాసేవ తెలియని కొంతమంది పుట్టుకురావడం హాస్యాస్పదంగా ఉందని నగర ప్రజలు, రాజకీయ పక్షాలు అభిప్రాయపడుతున్నాయి.

రాజమహేంద్రవరం కార్పొరేషన్ రాజకీయ నాయకులకు బ్రహ్మ పదార్థం లాగా కనిపిస్తోంది. రాజకీయ నాయకులు ఎవరైనా వారి స్థాయిని బట్టి మేయర్ గాను, లేదా కార్పొరేటర్ గా పోటీ చేసేందుకు ఆసక్తి చూపించడం, పదవుల ఆశించడం సహజం. అయితే జరుగుతాయో, జరగవో తెలియని ఎన్నికల్లో మేయర్ అభ్యర్థులుగా పోటీ చేస్తామని బయలుదేరడమే వింత గా ఉందంటున్నారు.

వాస్తవానికి కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే మేయర్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ నుంచి సీనియర్ నాయకుడు, ఎన్నో ఏళ్ళు రాజకీయ త్యాగాలు చేసిన గన్ని కృష్ణ ముందు వరుసలో ఉంటారన్నది అందరికీ తెలిసిందే. గత అసెంబ్లీ ఎన్నికల ముందు జనసేన నాయకుడు అత్తి సత్య నారాయణకు మేయర్ పదవికి హామీ లభించిందంటున్నారు.

వీరిద్దరి మధ్యలో తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకుడు ఎర్ర వేణుగోపాల రాయుడు కూడా మేయర్ పదవిని ఆశిస్తున్నారు. ఈ పదవి కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నవారు కొందరు, గత ఎన్నికల్లో హామీ పొందినవారు మరికొందరు ఆశావహుల పై పానకంలో పూడకలా మధ్యలో పుట్టుకొస్తున్న ప్రకటనలు వారి ఆశలపై నీళ్లు చల్లినట్లు అయింది.

**నగర ఎమ్మెల్యే ఏకపక్ష వైఖరి పై వ్యతిరేకత...**

నగరం మీద పట్టు కోసం నగర ఎమ్మెల్యే తన అనుచరులను ఈ దిశగా ప్రోత్సహిస్తున్నారా అనే అనుమానాలు కూటమి పార్టీల నాయకుల్లో వ్యక్త మవుతున్నాయి. కూటమి ధర్మాన్ని కాదని ఏకపక్షంగా మజ్జి రాంబాబుకి మద్దతు ప్రకటించడం పట్ల కుటమి పార్టీల నాయకుల మధ్య విభేదాలకు ఆస్కార మిస్తున్నాయి. సొంత తెలుగుదేశం పార్టీలోనే వర్గాలు, కుమ్ములాటలున్న క్రమంలో మజ్జి మేయర్ ప్రకటన వాటిని మరింత రాజేసిందుంటున్నారు. కుటమిలో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీలు భాగస్వామ్యం. కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే పొత్తు ధర్మం ప్రకారం ఏ పార్టీకి ఎన్ని స్థానాలు, ఎక్కడ పోటీ చేయాలి, ఉమ్మడి మేయర్ అభ్యర్థి ఎవరు ఇత్యాది అంశాలన్నీ ఆయా పార్టీల అధిష్టానాల స్థాయిలో చర్చించుకోవలసి ఉంది. అలాంటిదేమీ లేకుండానే ఏకపక్షంగా మజ్జి కి నగర ఎమ్మెల్యే మద్దతు పలకడం చూస్తే కుటమిలో ఐక్యత నేతి బీరకాయలో నెయ్యి చందాన ఉందని తెలుస్తోంది. ఎమ్మెల్యే ఏకపక్ష వైఖరి పై సొంత పార్టీలోనూ, కూటమిలోను అసహనం, వ్యతిరేకత అర్థమవుతుంది. ఈ ప్రభావం కూటమి పార్టీలవిజయాకాశాల ను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం అవుతుంది.

**మజ్జి వ్యవహార శైలి పై అసంతృప్తి..**

బీసీ వర్గాల్లో మజ్జి వర్గం కన్నా అత్తి సత్యనారాయణ మరింత వెనుకబడిన వర్గానికి చెందిన వారు. మజ్జి రాంబాబు మేయర్ అభ్యర్థి గా రాజకీయంగా సమర్థ నాయకుడా, సామాజి కంగా సత్తా ఉన్న నాయకుడా ప్రజాసేవ పరాయణుడా అని నగర ప్రజలు చర్చించు కుంటున్నారు. గత రెండున్నర సంవత్సరాలలోనూ కూటమి పార్టీల మధ్య సమన్వయం సాధించింది లేదని మజ్జి వైఖరి పై విమర్శలున్నాయి. 2009, 14 లో ఆయన బంధువు ఒకరు మహిళ కార్పొరేటర్ గా ఉన్నప్పుడు 6 వార్డులో రాజ్యాంగేతర శక్తిగా వ్యవహ రించారని ఆరోపణలు ఉన్నాయి. పార్టీ నగర అధ్యక్షుడిగా నగరంలో సొంత తెలుగుదేశం పార్టీలో క్యాడర్ మధ్య సమన్వయం చేయలేని వ్యక్తి ని, మూడు పార్టీల కూటమిలో ఎలా చేయగలరని పలువురు ప్రశ్నిస్తున్నారు. సొంత సామాజిక వర్గం తూర్పు కాపు సంక్షేమ సంఘనికి పన్నెండు ఏళ్ల పాటు సేవలు అందించానని, చెప్పుకోవాడాన్ని కూడా పలువురు ఎద్దేవా చేస్తున్నారు. సంఘాన్ని అభివృద్ధి చేసింది కూడా ఏమీ లేదని సొంత సామాజిక వర్గాలే పెదవి విరుస్తున్నాయి. మజ్జి వ్యవహార శైలి పై సామాజిక వర్గంలోనూ, తెలుగుదేశం పార్టీలోనూ తీవ్ర అసంతృప్తి, అసహనం నెలకొందని తెలుస్తుంది. తెలుగుదేశం పార్టీ నాయకులు మద్యం వ్యాపారాలకు దూరంగా ఉండాలని పార్టీ అధిష్టానం ఒక పక్క చెబుతుండగా, మజ్జి కి నగరంలో మద్యంవ్యాపారంతో ప్రత్యక్ష , పరోక్ష సంబంధాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యమే. అధికారికంగా ఉల్లిపాయల వ్యాపారం అయినప్పటికీ, అనధికారంగా మద్యం వ్యాపారంలో ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**కూటమి పార్టీల ఉమ్మడి**

అభ్యర్థి కోసం గాలింపు...

ఎన్నికలు జరిగితే గనక కూటమి పార్టీల మధ్య అందరికీ ఆమోదయోగ్య సామాజికంగా, ఆర్థికంగా ప్రజల్లో పలుకుబడి, ప్రజాసేవ తెలిసినవ్యక్తి కోసం కూడా ఆయా పార్టీల అధిష్టానాలు గాలిస్తున్నాయి. ఇక రెండోది ఎన్నికలంటేనే కోట్లతో ముడిపడిన వ్యవహారం, పైగా ఈసారి మేయర్ ఎన్నికలు ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నికునే విధానంలో జరుగుతుండ డంతో ఆర్థికంగా బలోపేతం గా ఉన్న వ్యక్తి పార్టీలకు అవసరం.

నాలుగో సారి కూడా మేయరు , కార్పొరేషన్ చే జిక్కించుకోవడానికి గత హామీలు నెరవేర్చడమా, కొత్త వ్యూహం ప్రకారం సమర్థుల కోసం తెలుగుదేశం పార్టీ, కూటమి పార్టీల అధిష్టానాలు గాలిస్తున్నాయని విశ్వాసనీయ వర్గాల సమాచారం.

## దాలిపాడు పారశాల విద్యార్థిలకు మలేరియా టెస్టులు చేసిన వైద్య సిబ్బంది

**వై రామవరం, పెన్ పవర్,సెప్టెంబర్ 1 :** మండలములో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల దాలిపాడు విద్యార్థినులకు మలేరియా జ్వరానికి సంబంధించిన పరీక్షలు నిర్వహించడం జరిగిందని మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు సంబంధించి వివిధ రకాల అనారోగ్యాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు రక్తహీనత, బిపి, మలేరియా వంటి పరీక్షలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగింది అని తెలిపారు.




## ఇంటింటికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



**సంక్షేమ పథకాల అమలులో జవాబుదారీతనం ఉండాలి**

**– కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 1:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా, సకాలంలో అందించడంతో పాటు వాటి అమలులో జవాబుదారీతనం కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. మంగళవారం బొమ్మూరులో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ సొమ్మును పంపిణీ చేసే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి పెన్షన్ అందుతున్న తీరును, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెన్షన్ సొమ్ము సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, పథకాల అమలులో పారదర్శకతతో పాటు జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. బొమ్మూరుకు చెందిన వితంతు పెన్షన్ లబ్ధిదారు రెడ్డి సత్యవతి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నెల అందిస్తున్న రూ.4,000 పెన్షన్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోందని తెలిపారు. నిత్యావసర వస్తువులు, మందులు, ఇతర కుటుంబ అవసరాలకు ఈ మొత్తాన్ని వినియోగించుకుంటున్నామని చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యే సమయంలో ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం ఎంతో ధైర్యాన్ని ఇస్తోందని, పెన్షన్ సొమ్మును ఇంటి వద్దకే వచ్చి అందించడం వల్ల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయిందని పేర్కొన్నారు. తమలాంటి వితంతు మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక చేయూతపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. మరో వితంతు పెన్షన్ లబ్ధిదారు కొప్పిశెట్టి సుబ్బాయమ్మ మాట్లాడుతూ నెలకు రూ.4,000 పెన్షన్ తమకు క్రమం తప్పకుండా అందడం వల్ల కుటుంబ ఖర్చులను కొంతమేర నిర్వహించుకోగలుగుతున్నామని తెలిపారు. రోజువారీ అవసరాలతో పాటు ఆరోగ్య సంబంధిత ఖర్చులకు ఈ మొత్తం ఎంతో తోడ్పడుతోందని చెప్పారు. ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ సొమ్మును అందించడం వల్ల వయస్సు, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా బయటకు వెళ్లాల్సిన ఇబ్బంది లేకుండా పోయిందని తెలిపారు. ప్రభుత్వం తమలాంటి పేద, వితంతు మహిళలను ఆదుకుంటూ అందిస్తున్న ఆర్థిక సహాయానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పెన్షన్ పంపిణీ విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో సెప్టెంబరు నెలకు సంబంధించి 2,66,554 ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు విడుదల కాగా, సాయంత్రం 5 గంటల వరకు 2,43,651 పెన్షన్లు పంపిణీ అయ్యాయి. దీంతో 91.41 శాతం భౌతిక పంపిణీ పూర్తయింది. పెన్షన్ల కోసం రూ.117.21 కోట్లు విడుదల కాగా, రూ.106.53 కోట్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దీంతో ఆర్థిక పంపిణీ 90.89 శాతంగా నమోదైంది. మండలాల వారీగా చూస్తే రాజమండ్రి అర్బన్ 94.04 శాతంతో అత్యధిక పంపిణీ నమోదు చేసింది. నిడదవోలు అర్బన్ 93.19 శాతం, నిడదవోలు 92.55 శాతం, చాగల్లు 92.52 శాతం, గోపాలపురం 92.14 శాతం, అనపర్తి 91.85 శాతం, కడియం 91.82 శాతం, రాజమహేంద్రవరం రూరల్ 91.76 శాతం, కొవ్వూరు 91.76 శాతం, పెరవలి 91.58 శాతం, దేవరపల్లి 91.55 శాతం, బిక్కవోలు 91.52 శాతం చొప్పున పెన్షన్లను పంపిణీ చేశాయి. మిగిలిన మండలాల్లోనూ 88 శాతానికి పైగా భౌతిక పంపిణీ నమోదైంది. కార్యక్రమంలో కలెక్టర్ వెంట రూరల్ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.ఎస్.ఆర్మ్‌స్ట్రాంగ్, డీడీఏ, ఏపీడీ వై.సత్యంనాయుడు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఎంపీ ని కలిసిన గడ్డ మణుగు

**జీలుగుమిల్లి ,పెన్ పవర్ ,సెప్టెంబర్ 1;** ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్ నీ జనసేన నేత, మాజీ జెడ్పిటిసి, ద్వారకా తిరుమల శ్రీ చిన్న వెంకన్న దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గడ్డ మణుగు రవికుమార్ మంగళవారం ఏలూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ నూతన గృహప్రవేశం సందర్భంగా కలిసినట్టు తెలిపారు. శ్రీ చిన్న వెంకన్న స్వామి వారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేసి అర్చకులతో వేద ఆశీర్వాదం అందించారు. ఎంపీ సారధ్యంలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని రవికుమార్ ఆకాంక్షించారు. రవికుమార్ అందించిన ఆశీస్సులతో ఎంపీ పొట్ట మహేష్ కుమార్ సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు.



# ప్రతి పింఛన్ లబ్ధిదారుడికి నిర్ణీత సమయంలోనే భరోసా పింఛన్





- నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు
- కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 1:** ప్రతి నెలా ఒకటో తేదీన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారులకు సకాలంలో అందించేలా జిల్లావ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.

మంగళవారం రంపచోడవరం మండలం బొర్నగూడెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. వివిధ రకాల సామాజిక పింఛన్ల లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారి చేతుల మీదుగా పింఛన్ మొత్తాలను అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి నెల ఒకటో తేదీన అన్ని రకాల సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందించేందుకు ఎక్కడికక్కడ సిబ్బందిని నియమించి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలవరం జిల్లాలోని ప్రతి మండలం, ప్రతి గ్రామంలో పింఛన్ లబ్ధిదారులకు నిర్ణీత సమయంలో పింఛన్లు అందేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు.

పింఛన్లు ప్రతినెలా సకాలంలో అందుతున్నాయా లేదా, రేషన్ బియ్యం క్రమం తప్పకుండా పంపిణీ జరుగుతోందా అనే విషయాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పలు ఇళ్లను సందర్శించిన కలెక్టర్, చిన్నారులకు సకాలంలో టీకాలు వేయిస్తున్నారా లేదా అనే అంశంపై కూడా తల్లిదండ్రులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఓ చిన్నారిని కలెక్టర్ ఎత్తుకుని ఆప్యాయంగా పలకరించారు.

గ్రామంలో అంగన్‌వాడీ భవనానికి, పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలని, గ్రామంలో పూర్వం నుంచి నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు కొత్త గృహాలు మంజూరు చేయాలని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సామాజిక పింఛన్ల పంపిణీలో ఎవరైనా అధికారులు లేదా సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ కె. దినేష్ కుమార్ హెచ్చరించారు.

కలెక్టర్ వెంట పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ మహమ్మద్ షరీఫ్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకర్ రావు, తహసీల్దార్ సీహెచ్ బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, ఎంపీడీవో పరిపాలన అధికారి పి. జయంతి, పీఏవో ఎల్. రాంబాబు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

- పింఛన్ డబ్బులకు ఎవరైనా లంచం అడిగితే ఇవ్వొద్దు
- జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు సకాలంలో అందేలా చర్యలు చేపట్టిందని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ తెలిపారు.

మంగళవారం రంపచోడవరం మండలంలోని పెద్దగెద్దాడ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లను అందజేశారు.

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర పింఛన్ లబ్ధిదారులతో జాయింట్ కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయంపై కూడా ఆరా తీశారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మొదటి తేదీన ఇంటి వద్దకే పింఛన్ అందించే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి జాప్యం, ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పింఛన్ లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతినెల రేషన్ సకాలంలో అందుతోందా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

పింఛన్ డబ్బులకు ఎవరైనా లంచం అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. పింఛన్ మొత్తాన్ని ఎవరైనా అక్రమంగా లేదా లంచంగా డిమాండ్ చేస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ డబ్బులను వ్యక్తిగత ఖర్చులు, కుటుంబ పోషణ, ఇతర అవసరాల కోసం వినియోగించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

జాయింట్ కలెక్టర్ వెంట డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు, ఏపీఎం మధు, వీఆర్వో యోసోబు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

వికలాంగురాలికి వెంటనే ట్రైసైకిల్ మంజూరు చేసిన కలెక్టర్ కె. దినేష్ కుమార్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ,సెప్టెంబర్ 1:** పోలవరం జిల్లాలోని వికలాంగులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి అందాల్సిన సంక్షేమ పథకాలను అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.

మంగళవారం రంపచోడవరం మండలం ముసురుమిల్లి పంచాయతీ పరిధిలోని బొర్నగూడెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, చిన్నారులకు సకాలంలో టీకాలు వేయిస్తున్నారా లేదా అనే విషయాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. బడిఈడు పిల్లలను పాఠశాలలకు, చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపిస్తున్నారా అని ముఖ్యంగా మహిళలను ఆరా తీశారు.

ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వికలాంగురాలు పల్లాల వెంకటరమణకు ట్రైసైకిల్ మంజూరు చేయాలని ఆమె తల్లిదండ్రులు, గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్ కె. దినేష్ కుమార్, వెంకటరమణకు ట్రైసైకిల్ మంజూరు చేయడంతో పాటు తక్షణమే పంపిణీ చేయించారు.


కలెక్టర్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలోని వికలాంగులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హతను బట్టి అన్ని సంక్షేమ పథకాలను అందజేస్తామని తెలిపారు. వికలాంగుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

వెంటనే స్పందించి ట్రైసైకిల్ మంజూరు చేసి పంపిణీ చేయించిన కలెక్టర్ కె. దినేష్ కుమార్‌కు వికలాంగురాలు పల్లాల వెంకటరమణ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, ఎంపీడీవో కార్యాలయ ఏవో పి. జయంతి, వి. శేఖర్, గణపతి, రాజు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పటిష్టమైన పాఠ్యప్రణాళికలు రూపొందించాలి

పీజీ బీ.ఓ.ఎస్. సమావేశం లో వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ




**రాజమహేంద్రవరం, పెన్ పవర్ సెప్టెంబర్1 :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి వైవిధ్య విద్యావిధానమే బలమని, అన్ని విభాగాలు పటిష్ట, సందర్భోచిత, విప్లవాత్మక పాఠ్యప్రణాళికలు రూపొందించాలని, నాణ్యమైన ఉన్నత విద్యా ప్రమాణాలు అందిచడమే లక్ష్యంగా సిలబస్ సిద్ధం చేయాలని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ అన్నారు. మంగళవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ మీటింగ్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, డీన్ అకడమిక్ అఫైర్స్ డా.కె.రమణేశ్వరి వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుండి బీఓఎస్ చైర్మన్స్ హాజరయ్యారు. అతిథులు నన్నయ విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాల యంలోని 18 విభాగాలలో ప్రతి ఒక్కటీ కీలకమైన దన్నారు . సాహిత్యం , జన్యువులను , మార్కెట్ , లేదా అల్గారిథమ్‌లను వంటివి పరస్పరం ఆధారపడి ఉంటుందని తెలిపారు. పాఠ్యప్రణాళిక రూపకల్పనను పునఃరూపకల్పన చేయడం, నిపుణుల భాగస్వామ్యానికి ప్రాధాన్యతనివ్వడం, అంచనా మూల్యాంకనంపై పునరాలోచన, ఆవిష్కరణలను భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే కోర్సులను ప్రోత్సహించడం, భారతీయ జ్ఞాన వ్యవస్థను ఏకీకృతం చేయడం వంటి ఐదు అంశాలను తెలియజేశారు. భౌతికశాస్త్రం నుండి రాజనీతి శాస్త్రం వరకు, జంతుశాస్త్రం నుండి ఆక్వాకల్చర్ వరకు ప్రతి విభాగానికి తనదైన ప్రత్యేకత ఉందని చెప్పారు.

డీన్ అకడమిక్ అఫైర్స్ డా.కె.రమణేశ్వరి మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఉన్న పీజీ కళాశాలలకు చెందిన పాఠ్య ప్రణాళికలు రూపకల్పన, సిలబస్ లోని మార్పులు చేర్పులు చేసేందుకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ మీటింగ్ నిర్వహించా మన్నారు. దీనిలో 18 విభాగాలకు చెందిన ఆచార్యులు, విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుండి హాజరయ్యారని తెలియజేశారు. జూవాలజీ, అక్వాకల్చర్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సైకాలజీ, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్, ఫొరసిక్ సైన్సెస్, సోషల్ వర్క్, కంప్యూటర్ సైన్స్, బోటనీ, ఇంగ్లీషు, తెలుగు, ఫిజిక్స్, జియోసైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మాథ్మెటిక్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మైక్రోబయోలజీ, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్స్, కామర్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ సబ్జెక్టులలో నిపుణులు పాఠ్యప్రణాళికలపై చర్చించి సిలబస్ రూపొందించారు.

# ప్రజాసేవలోనే కూటమి ప్రభుత్వం ముందుకు

- సిరిపురంలో పింఛన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి
- "రెండేళ్ల నమ్మకం -- ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమం





**గంగవరం /మారేడుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** కూటమి ప్రభుత్వం ఏర్పడి విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రంపచోడవరం శాసనసభ్యురాలు, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి తెలిపారు.

మంగళవారం మారేడుమిల్లి మండలం దొరచింతలపాలెం పంచాయతీ పరిధిలోని సిరిపురం గ్రామంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంతో పాటు "రెండేళ్ల నమ్మకం -- ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ మొత్తాలను అందజేశారు. అనంతరం "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలు, సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు.

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ద్వారా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మారేడుమిల్లి మండల అధ్యక్షుడు గురుకు కుమార్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మల్లా దుర్గాప్రసాద్, రాష్ట్ర నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర్ ఫేక్ సుభాని, క్లస్టర్ ఇన్‌చార్జి డాక్టర్ పల్లాల రాజకుమార్ రెడ్డి, ఐటీడీపీ రంపచోడవరం నియోజకవర్గ అధ్యక్షుడు పాము రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి కర్రీ సన్యాసిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి అందాల సూర్యనారాయణ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు బి.శెట్టి అప్పాజీ, సుండం ప్రకాష్‌రావు, కర్రం సోమరాజు, విందెల గోపి, మాజీ సర్పంచ్ వీరవల్లి జార్జిబాబు, మాజీ ఎంపీటీసీ కానెం విజయలక్ష్మి, మాదాసి తిరుపతిరావు, సుంద్రం అబ్బాయిదొర, కత్తుల బంగారు రెడ్డి, కత్తుల కర్రెడ్డి, కత్తుల శ్రీనివాసరెడ్డి, దూడ ప్రణీత్, గొర్లె నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 30 లక్షలతో 39వ డివిజన్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** పుష్కరాల అభివృద్ధి పనుల్లో నగరంలోని ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఇప్పటికే రూ.140 కోట్లతో పబ్లిక్ హెల్త్ విభాగం ద్వారా చేపట్టనున్న పుష్కర పనుల్లో డ్రైనేజీ అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించా మన్నారు. మరో రూ.300 కోట్ల పనులకు నిధులు మంజూరయని చెప్పారు. స్థానిక 39వ డివిజన్‌లోని సాయిబాబా ఆలయం నుంచి పేపర్ మిల్లు పుంత రోడ్డు మీదుగా యాళ్లవారి వీధి అభివృద్ధి పనులకు రూ.30 లక్షలతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. టీడీపీ యర్రా వేణుగోపాల రాయుడు, 39వ డివిజన్ , హితకారిణి సమాజం చైర్మన్ యాళ్ల ప్రదీప్ తదితరులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నీటమునిగే వన్నారు. ప్రధాన డ్రైన్‌కు కల్వర్టు నిర్మించి నీటి ప్రవాహాన్ని మళ్లించడం తోపాటు, కొత్త డ్రైనేజీని నిర్మిస్తున్నామని, రోడ్డు ఎత్తును పెంచుతున్నామని వివరించారు. అశోక్ కళ్యాణ మండపం సమీప ప్రాంతాల్లో నీటిముంపు సమస్య ఉందని, సుమారు రూ.25 కోట్లతో చేపట్టనున్న ప్రధాన పనులను పుష్కరాల అభివృద్ధి కార్యక్రమాల్లో చేర్చామని వివరించారు. స్వతంత్ర హాస్పిటల్ సమీపంలోనూ రహదారి, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తు న్నామన్నారు. పుష్కరాల అభివృద్ధి పనులకు సంబంధించి మరో రూ.300 కోట్ల నిధులు మంజూరు కానున్నాయని, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పని ప్రదేశం వద్ద అస్వస్థతకు గురై మృతి చెందిన ఉపాధి కూలి



**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** మండలంలోని జడేరు కు చెందిన ఉపాధి హామీ శ్రామికుడు వి మహేశ్వరరావు ఉపాధి పని వద్ద అస్వస్థతకు గురి కావడంతో ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు ఎంపీడీవో లక్ష్మణరావు, ఏపీఓ ప్రకాష్ తెలిపారు. సోమవారం జడేరు కు చెందిన మహేశ్వర రావు అదే గ్రామంలోని యాట్ల చిన్నారెడ్డి చెరువు వద్ద పనికి హాజరుకాగా మొదటి హాజరు వేసిన అనంతరం తీవ్ర అస్వస్థ కు గురి అయ్యాడు. దీంతో సాటి ఉపాధి శ్రామికులు అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మహేశ్వర రావు మృతి చెందినట్లు వైద్యాధికారులు ధ్రువీకరించారు. మృతి చెందిన ఉపాధి శ్రామికుడు మహేశ్వరరావు కుటుంబ సభ్యులకు తక్షణ సహాయంగా ప్రభుత్వం నుండి రావలసిన సహాయాన్ని అందించేందుకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపీడీవో లక్ష్మణరావు, ఏపీవో ప్రకాష్ తెలిపారు.

# ధవలేశ్వరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

* దళిత లంక బుజ్జికి రూ.10 వేలు ఆర్థిక సహాయం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మంగళవారం ధవలేశ్వరం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ లో ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొని కొంతమందికి 4వేల రూపాయలు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్య గోరంట్ల మాట్లాడుతూ వృద్ధులు వితంతువులు, దివ్యాంగులు ఇతర అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఎన్టీఆర్ భరోసా పథకం ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఇంటింటికి వెళుతున్నామని, కూటమి ప్రభుత్వంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నా రన్నారు .ఈరెండేళ్లలో చేసిన అభివృద్ధి సంక్షేమలను ప్రజలకు తెలియ జేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామానికి చర్మ కార దళిత యువకుడు లంక బుజ్జి కి సామాగ్రి కొనుగోలుకు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్స్యేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందూరి అప్పారావు, పుక్కళ్ల రాజు, సావాడ శ్రీనివాసరెడ్డి, ఒంటెద్దు స్వామి, షేక్ అమీనా బేగం, గుర్రాల వెంకట్రావు, ఆళ్ల ఆనందరావు, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, నీలి కోటేశ్వరరావు, బత్తిన ఏడుకొండలు, కొడమంచలి సూర్య, నాళ్ళ రమేష్, దాసరి సాగర్, దాసరి చిన్న రమణ, ఇళ్ల రాంబాబు, కూరసాల ప్రసాద్, ముచ్చి నాని, ఆళ్ల విటల్, కోరాడ వెంకటేష్, ఎమ్మెస్సార్ శ్రీను, చోళ్ల వెంకటేష్, కింథాడ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గంగవరం మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

* పలు గ్రామాల్లో లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్ల అందజేత





**గంగవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 1:** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది కలిసి లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు.
గంగవరం మండలం ఏటిపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నేత, రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు, టీడీపీ కార్యకర్త గడుతురి నాగేశ్వరరావు సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు.
అదేవిధంగా మర్రిపాలెం గ్రామంలో గంగవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.
మరోవైపు గంగవరం పంచాయతీ పరిధిలోని పాత గంగవరం గ్రామం, ఆమదాలబంధ పంచాయతీ పరిధిలోని రాజంపాలెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ ఆధ్వర్యంలో నిర్వహించారు.
పాత గంగవరం గ్రామంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభతో పాటు బూత్ కన్వీనర్ సారపు సత్యవేణి, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసు జయలక్ష్మి పాల్గొన్నారు.
రాజంపాలెం గ్రామంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, గంగవరం సచివాలయ సిబ్బంది డి.ఏ. వెంకటేష్, టీడీపీ నాయకుడు కలుముల చిన్నలుదొర తదితరులు పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అర్హులైన లబ్ధిదారులకు ప్రతి నెలా సకాలంలో పింఛన్లు అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పింఛన్ లబ్ధిదారులు, స్థానిక ప్రజలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## క్రీడాకారులకు గడ్డమణుగు ఆర్థిక సహాయం




**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 1 ;** యువత క్రీడలతోపాటు విద్యపై కూడా దృష్టి పెట్టి ఉన్నత లక్ష్యాలను సాధించి జీవితంలో స్థిరపడాలని జనసేన నేత, మాజీ జెడ్పిటిసి, ద్వారకాతిరుమల శ్రీ చిన్న వెంకన్న దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గడ్డమణుగు రవికుమార్ సూచించారు. మంగళవారం జీలుగుమిల్లిలో జి ఎస్ ఎం గార్డెన్ నందు వాలీబాల్ క్రీడాకారులకు జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన పురస్కరించుకొని ఆర్థిక సహాయం అందజేశారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం ఆసుపాక గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించడం ద్వారా గ్రామానికి ,కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

# కడియంలో 3న ఎంపీ చే ప్రారంభించనున్న శిక్షణ



* పూల వ్యర్థాలతో విలువ ఆధారిత ఉత్పత్తులతో మహిళలకు ఉపాధి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** దేవాలయాలు, నర్సరీల్లో ని పూల వ్యర్థాలను సద్వినియోగం చేసుకుని విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో కడియం మండలంలో 'టెంపుల్ ఎసెన్షియల్స్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఎలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయం లో తొలి రోజు శిక్షణా కి ఎంపీపీ హాజర య్యారు. సెప్టెంబరు 1 నుంచి 5వ తేదీ వరకు కడియం మండల సమాఖ్య కార్యాలయంలో ఐదు రోజులపాటు జరిగే ఈ శిక్షణలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 30 మంది మహిళా పొదుపు సంఘ సభ్యులు పాల్గొంటున్నట్లు ఎలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ తెలిపారు.
పుష్ప వ్యర్థాలను ఉపయో గకరమైన ఉత్పత్తులుగా మార్చడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళలకు అదనపు ఆదాయ మార్గాలను కల్పించవచ్చన్నారు. ఏపిడి వై ముత్యం నాయుడు మాట్లాడుతూ, శిక్షణ పొందుతున్న మహిళా సభ్యులతో పాటు, పుష్ప వ్యర్థాల సద్వినియోగం పై అవగాహన కల్పించాల న్నారు. విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ అవకాశాలపై ఈ ఐదు రోజుల శిక్షణ లో అవగాహన కల్పించనున్నా మన్నారు.ఈ కార్యక్రమానికి ఎఫ్ఎఫ్‌డీసీ నిర్ణయించిన మొత్తం వ్యయం 18 శాతం జీఎస్టీతో కలిపి రూ.4,36,600 కాగా, ఇందులో ఏ ఎల్ ఈ ఏ ఎఫ్ సంస్థ సొంత నిధుల నుంచి రూ.2 లక్షలు చెల్లించిందన్నారు .మిగిలినరూ.2,36,600లను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాజమ హేంద్రవరం రీజినల్ మేనేజర్ సహకారంతో సమకూర్చినట్లు తెలియ చేశారు.అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధి సునీత మాట్లాడుతూ.. దేవాల యాలు, నర్సరీల నుంచి సేకరించే పుష్ప వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెస్ చేసి అగరబత్తీలు, ధూప్ కోన్స్, హవన సామగ్రి, సహజ పరిమళ ద్రవ్యాలు తదితర విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసే విధానాలపై మహిళలకు నిపుణులతో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి చొరవతో డీఆర్‌డీఏ--సెర్ప్, జిల్లా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫ్రాగ్రెన్స్ అండ్ ఫ్లేవర్ డెవలప్‌మెంట్ సెంటర్ కన్నౌజ్, అలీప్ సంస్థల సమన్వయంతో శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుష్ప వ్యర్థాలను ఆదాయ వనరుగా మలచడం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదప డుతుందన్నారు. ఈ శిక్షణ ప్రారంభోత్సవాన్ని సెప్టెంబరు 3న ఉదయం 10 గంటలకు కడియంలోని జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి ప్రారంభించ నున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ శ్రీమతి కీర్తి చేకూరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కడియం మండల పరిషత్ అధ్యక్షుడు ఎలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు. తొలి రోజు శిక్షణా కార్యక్రమంలో ూాజూూ ప్రతినిధి సునీత, ఏపీడీ సత్యం నాయుడు, డీపీఎం హేమంత్, డీఆర్‌డీఏ--సెర్ప్ సిబ్బంది, మహిళా పొదుపు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**కొత్త పింఛన్ల కోసం అవసరమైన పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి**

**తాజా మాజీ సర్పంచ్ కుంజం రాజమణి**



**గంగవరం /దేవీపట్నం, పెన్ పవర్ సెప్టెంబర్ 1:** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలంలోని దేవీపట్నం పంచాయతీ పరిధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.
దేవీపట్నం ఆర్ అండ్ ఆర్ కాలనీ, ఏనుగులగూడెం, అగ్రహారం తదితర కాలనీల్లో దేవీపట్నం తాజా మాజీ సర్పంచ్ కుంజం రాజమణి, మండల తెలుగుదేశం పార్టీ మాజీ యువత అధ్యక్షుడు లంక హరిబాబు చేతుల మీదుగా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు.
ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ కుంజం రాజమణి మాట్లాడుతూ, రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఈ నెలలో కొత్త పింఛన్ల మంజూరు కోసం దరఖాస్తులను స్వీకరించే అవకాశం ఉన్నందున, అర్హులైన వారు అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుని ఉంచుకోవాలని సూచించారు.
పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం తదితర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆమె కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో గేదెల పెద్ద సుబ్బారావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంత ఎస్సీ మాదిగల సమస్యలు పరిష్కరించాలి



**పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతిపత్రం**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 1:** పోలవరం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న దళిత ఎస్సీ మాదిగల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు దళిత నాయకులు, ప్రతినిధులు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలోని ఎస్సీ మాదిగలకు రాజ్యాంగంలో కల్పించిన ప్రాథమిక హక్కులకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలని వారు కోరారు. పూర్వం నుంచి ఎస్సీలకు గృహాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలోని ఏకలవ్య పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఎస్సీ విద్యార్థులకు తగిన సీట్లు కేటాయించాలని కోరారు. ఎస్సీ వర్గాలకు చెందిన పట్టభద్ర నిరుద్యోగులకు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్, పీజీ పూర్తి చేసిన ఎస్సీ నిరుద్యోగులకు గ్రూప్--1, గ్రూప్--2 వంటి పోటీ పరీక్షలకు నిర్వహించే ఉచిత కోచింగ్‌లో గిరిజన నిరుద్యోగులతో పాటు కొంతమేర సీట్లు కేటాయించాలని కోరారు. సెటిల్మెంట్ పట్టాలు కలిగిన ఎస్సీల భూములకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.
అయితే ఆదివాసీ గిరిజనుల హక్కులు, వారికి సంబంధించిన చట్టాలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఎస్సీల సమస్యలను పరిష్కరించాలని వారు కలెక్టర్‌ను కోరారు.
ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి డాక్టర్ నిడమర్తి చినబాబు, గంగవరం మండల మాజీ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు ములగాడ ప్రసాద్, మాజీ కార్యదర్శి ములగాడ సోమరాజు, నెల్లిపూడి గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ మసిరిపం బాను మూర్తి, అయినవిల్లి నాని, కాపవరపు నాగబాబు చంటీతో పాటు దేవీపట్నం, గంగవరం మండలాలకు చెందిన ఎస్సీ దళితులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎల్ఐసి 70వ. ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 01:-** ఎల్ఐసి 70వ. ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గోకవరం బ్రాంచ్ మేనేజర్ డి.ఎస్.వి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాటు చేయబడింది. మొదటగా ఎల్ఐసీ నిగమ్ గీత్ ఆలపించారు.ఈ కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మాట్లాడుతూ ఎల్ఐసి పాలసీదారులకు చేస్తున్న విశిష్ట సేవలను కొనియాడుతూ ప్రపంచంలోనే జీవిత బీమా సంస్థ మూడవ స్థానంలో ఉన్నదని తెలియజేశారు.ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ డి.ఎస్.వి సూర్యనారాయణ మాట్లాడుతూ 1956వ సంవత్సరం సెప్టెంబర్ ఒకటో తేదీన సుమారు ఐదు కోట్ల రూపాయలతో ప్రారంభించిన ఎల్ఐసి సంస్థ దిన దిన అభివృద్ధి చెంది ఇప్పటికి 59.03 లక్షల కోట్లు
నికర ఆస్తులు కలిగి,30 కోట్ల పాలసీదారులతో, మార్కెట్ లో ఎల్ఐసి వాటా 65.16 శాతంతో, డెత్ క్లెయిమ్ సెటిల్మెంట్ లో 99.44 శాతంతో ప్రపంచం లోనే మూడో స్థానంలో ఉన్నదని, భారతదేశంలో ఇన్సూరెన్స్ రంగంలో అగ్రగామిగా కొనసాగుతున్న ఏకక సంస్థ ఎల్ ఐ సి సంస్థని తెలియజేశారు.ఈ వారోత్సవాలు ఏడు రోజులు జరుగుతాయని, విద్యార్థినీ,విద్యార్థులకు క్విజ్,వ్యాసరచనపోటీలు నిర్వహించి బహుమతుల ప్రధానము చేయడం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో ఆఫీసర్లు కె పోతురాజు, పి టి మారయ్య, ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ కె మురళి కృష్ణ ప్రసాద్,సెక్రెటరీ జి రాధాకృష్ణ,జాయింట్ సెక్రటరీ యం సత్య నారాయణ,ట్రెజరర్ లీలా కృష్ణ, డెవలప్మెంట్ ఆఫీసర్ చంద్రమౌళి,ఆఫీస్ సిబ్బంది, ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ సెక్రెటరీ నాగారపు నాగరాజు,చోడిశెట్టి గుప్తా,కరిబండి నాగేశ్వరరావు,పడమటి నాగేశ్వర రావు,కరిబండి విష్ణు,మసిముక్కుల రామకృష్ణ, కె రామకృష్ణ,టి సుబ్రమణ్యం, జిఎంఆర్ బాబ్జి,మెప్పెల్లి జయరాజు తదితర ఏజెంట్లు పాల్గొన్నారు.

# మహిళ పై హత్యాయత్నం కేసులో నిర్లక్ష్యం వహించిన పోలీసులపై వేటు

**ఒక ఎస్సై, ముగ్గురు కానిస్టేబులను వి ఆర్ లో పెట్టిన ఎస్పీ**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** గత నెల 25వ తేదీన పుట్టినరోజు వేడుకల పేరుతో నమ్మించి తీసుకెళ్లి, ఇద్దరు అన్నదమ్ములు ఆ మహిళపై హత్యాయత్నా నికి పాల్పడిన కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించిన పోలీసులపై ఉన్నతాధి కారులు వేటు వేశారు. కొరుకొండ మండలం పరిధిలోని గాడాల గ్రామానికి చెందిన మట్టడి అయ్యప్ప, మట్టాడి ప్రసాదులు అనే అన్నదమ్ములు రూరల్ మండలం బొమ్మూరుకు గ్రామానికి చెందిన గడ్డం ధనలక్ష్మిని తల పై సుత్తితో తీవ్రంగా కొట్టి గాయపర చగా స్పృహ తప్పి పడిపోవడంతో మృతి చెందిందనే భావనతో 3 టౌన్ పరిధిలోని క్వారీ గోతుల్లో పడవేసిన సంగతి తెలిసిందే. 26వ తేదీ ఉదయాన ఆమె స్పృహ లోకి వచ్చి స్థానికుల, పోలీసుల సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. ఈ సంఘటన గత నెల 25వ తేదీన జరిగితే, 26వ తేదీన ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ పోస్ట్ పోలీస్ స్టేషన్
పోలీసులు కోరుకొండ పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వని అవుట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ ఏ ఎస్ ఐ శ్రీదేవిని, స్టేషన్ పరిధిలో జరిగిన హత్య యత్నం కేసు నమోదులో నిర్లక్ష్యం వహించిన కోరుకొండ ఎస్సై రమేష్ ను, క్వారీ గోతుల పరిధి వచ్చే త్రి టౌన్ కు చెందిన హెడ్ కానే స్టబుల్ లక్ష్మణ్ , నాగ మల్లేశ్వర రావు ఇద్దరు పోలీసులను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వి ఆర్ కు పంపించామని నార్త్ జోన్ డీఎస్పీ సిహెచ్. జీవన తెలిపారు. బాలికలు మహిళల నేరాలు పట్ల ప్రభుత్వం ఉంటుందని నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తుందని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బంది పై శాఖ పర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఎంపీ తో ఎమ్మెల్యే భేటీ



**జీలుగుమిల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 1** ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్ ని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మంగళవారం ఏలూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ నూతన గృహప్రవేశం ఇటీవల జరిగిన సందర్భంగా ఎమ్మెల్యే వెళ్లారు ఎమ్మెల్యే బాలరాజుని ఎంపీ పుట్ట మహేష్ కుమార్ సాదరంగా ఆహ్వానించి, సాలువతో సత్కరించారు .అనంతరం ఇరువురు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.

# లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ


కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** అర్హులైన వారందరికీ ప్రభుత్వం పారదర్శకంగా పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. మంగళవారం శ్యామలనగర్లో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఆధార్ కార్డులను పరిశీలించి, ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా చెక్ చేసి పింఛన్ డబ్బులు అందించారు. కేటగిరీల వారీగా లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అందిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పింఛన్ దారులతో మాట్లాడుతూ.. వారికి అందుతున్న సౌకర్యాలు, పింఛన్ ఏవిధంగా ఉపయోగప డుతుందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీకి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. అర్బన్ పరిధిలో పింఛన్ల పంపిణీ నిర్దిష్టంగా ఒకటవ తేదీ ఉదయం నుంచి ప్రారంభం అయిందని. లబ్ధిదారులు అసౌకర్యానికి గురికాకుండా ఉదయం 6 గంటల నుండి సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ నెలకు సంబంధించిన పింఛన్లు నగరంలో 27,239 పింఛనుదారులకు ప్రభుత్వం రూ.12 కోట్ల 3 లక్షల 29 వేల రూపాయలు విడుదల చేసిందన్నారు. పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా, శత శాతం పూర్తిచేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సెక్రటరీ శైలజవల్లి, ఎంహెచ్ఓ వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## తంటికొండ వెంకన్న ఆలయం కొండపై మృత్యుగొయ్యి







- వెదురు బొంగులతో భద్రతా వలయమా? -
- దేవాదాయ శాఖ నిర్లక్ష్యం ఫోటోల్లో బట్టబయలు

**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 01:-** తూర్పుగోదావరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం తంటికొండ పై వెలసిన శ్రీ శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల భద్రత గాలిలో దీపంలా మారింది. కొండపైన, భక్తులు ప్రదక్షిణలు చేసే ప్రధాన మార్గంలోనే సుమారు 10 అడుగుల లోతైన స్లాబ్ కూలి ఏకంగా మృత్యుగొయ్యిగా మారి 5 నెలలు కావస్తున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వేల సంఖ్యలో వచ్చే భక్తులు ప్రదక్షిణలు చేసే ఈ మార్గంలో ఇలాంటి గొయ్యి పట్ల దేవాదాయ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మా క్షేత్రస్థాయి ఫోటోల పరిశీలనలో తేటతెల్లమైంది.

**ఇది గది కాదు, భక్తుల దారే కూలింది:**

ఫోటోలను నిశితంగా పరిశీలిస్తే కూలినది ఏదో మామూల గది కాదు. భక్తులు నిలబడి కొబ్బరి కాయలు కొట్టే, టైల్స్ వేసిన ప్రధాన ప్రాంగణమే కుంగిపోయింది. పైన కనిపిస్తున్న ఇనుప చువ్వలు పూర్తిగా తుప్పుపట్టి, సిమెంట్ పెచ్చులుగా మారిపోయాయి. కింద చూస్తే పాత చెక్క తలుపులు, లోపల చెత్తాచెదారం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**వర్షానికి తుప్పుపట్టి కూలిన పాత నిర్మాణం:**

గోడలపై నల్లటి తేమ మరకలు, స్లాబ్ కాంక్రీట్ నానిపోవడం చూస్తే ఏళ్ల తరబడి వర్షపు నీరు లీక్ అయ్యి స్లాబ్ బలహీనపడిందని అర్థమవుతోందని భక్తులు అంటున్నారు.దీనికి కాలపరీక్ష, భద్రతా ఆడిట్ అనేది ఎప్పుడూ జరగలేదన్నట్లు స్పష్టమవుతోంది. పక్కనే ఉన్న పారాపెట్ గోడ కూడా పెచ్చులు ఊడి ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో ఉంది.

**భద్రతా చర్యలు శూన్యం భక్తుల్లో ఆందోళన:-**

అత్యంత ప్రమాదకరమైన విషయం ఏమిటంటే, ఈ గొయ్యికి కేవలం 2 అడుగుల దూరంలోనే భక్తులు కూర్చునే సిమెంట్ బెంచీ ఉంది. శనివారం వేల మంది భక్తులు వచ్చినప్పుడు పొరపాటున తోపులాట జరిగితే లేదా రాత్రి వేళ వెలుతురు తక్కువగా ఉన్నప్పుడు ఎవరైనా పొరపాటున అడుగు వేస్తే నేరుగా 15 అడుగుల లోతులోకి పడాల్సిందే. దీన్ని కప్పేందుకు అధికారులు చేసిన ప్రయత్నం చూస్తే భక్తులు మండిపడుతున్నారు.ఫోటోలో కనిపిస్తున్నట్లు గా రెండు వెదురు బొంగులు,రటcడు వేరే కర్రలు ఒక పాత భోజనం చేసే బల్ల, ఒక తెల్లటి గుడ్డను గొయ్యి మీద పడేశారు. ఇది హెచ్చరికా? లేక ప్రమాదాన్ని దాచే ప్రయత్నమా? అని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

**నక్షత్ర తాబేలు వద్దకు వెళ్తూ... గొయ్యిలోకి జారితే?లి**

ఈ గొయ్యి పక్కనే ఉన్న నక్షత్ర తాబేలుకు అరటిపండ్లు వేసేందుకు భక్తులు, ముఖ్యంగా పిల్లలు ఆసక్తిగా ఆ వైపు వెళుతుంటారు. ఆ సమయంలో ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు అని భక్తులు ప్రశ్నలు కురిపిస్తున్నారు?
వెంటనే ఆ శిథిలమైన గదిని పూర్తిగా కూల్చివేసి, కొత్త స్లాబ్ వేయాలని,తాత్కాలికంగా ఆ ప్రదేశం చుట్టూ ఇనుప గ్రిల్ తో 6 అడుగుల ఎత్తున ఫెన్సింగ్ వేసి, రేడియం హెచ్చరిక బోర్డులు పెట్టాలని,ఆలయ కొండపై ఉన్న అన్ని పాత నిర్మాణాలకు భద్రతా ఆడిట్ చేయించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

వేల సంఖ్యలో వెంకన్న స్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు తంటికొండ ఆలయంలో భక్తుల ప్రాణాలకు మాత్రం రెండు వెదురు బొంగులే దిక్కా? అని ప్రశ్నిస్తూ, జిల్లా కలెక్టర్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి యుద్ధ ప్రాతిపదికన సిమెంట్ ఇటుకలు లేదా ఇనప డ్రిల్స్ తో రక్షణ గోడ ఏర్పాటు చేయాలని మరిన్ని పాత శిథిలాలు ఏదైనా ఉంటే వాటి పట్ల కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ స్లాబ్ కూలిపోవడం పైన సంబంధిత ఆలయ కార్య నిర్వహణ అధికారిని వివరణ కోరెందుకు ప్రయత్నించుగా అందుబాటులో లేరు

## ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలి

- లేకుంటే ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహించి అర్హత మార్కులు తగ్గించాలి: యూటీఎఫ్ డిమాండ్
- సెప్టెంబర్ 3న చలో విజయవాడను జయప్రదం చేయాలని పిలుపు




**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి పూర్తిస్థాయిలో మినహాయింపు కల్పించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం టెట్ పరీక్ష నిర్వహించాల్సి వస్తే ఆన్‌లైన్ విధానాన్ని కాకుండా ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహించడంతో పాటు అర్హత మార్కులను తగ్గించాలని కోరారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 3న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ మేరకు గంగవరం మండల కేంద్రంలో చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ, గంగవరం మండల అధ్యక్షుడు కారం బొజ్జిదొర, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి తదితరులు ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ, విద్యారంగంలో ఇప్పటికే సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు తిరిగి టెట్ పరీక్ష నిర్వహించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఉపాధ్యాయుల సుదీర్ఘ అనుభవం, సేవలను పరిగణనలోకి తీసుకుని వారికి టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం టెట్ నిర్వహణపై ముందుకు వెళితే ప్రస్తుతం ఉన్న ఆన్‌లైన్ పరీక్ష విధానాన్ని తొలగించి ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహించాలని, అర్హత సాధించేందుకు అవసరమైన మార్కులను తగ్గించాలని డిమాండ్ చేశారు.
ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సెప్టెంబర్ 3న విజయవాడలో నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు ఎల్. రుక్మిణిదేవి, సహాధ్యక్షుడు ఆర్. చిన్న వెంకటరెడ్డి, కార్యదర్శులు కారం రాంబాబు, కారం లక్ష్మి, ఎన్. దుర్గాదేవి, వంశీప్రియ, మండల కోశాధికారి సత్యకిరణ్‌రెడ్డి, చింతజి నాగేశ్వరరావు, కుసుమకుమారితో పాటు పలువురు మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలి: వైసీపీ నాయకుడు పండా సిద్ధార్థ దొర



**గంగవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 1:** పోలవరం జిల్లా గంగవరం మండలం గంగవరం గ్రామంలో యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పండా సిద్ధార్థ దొర అన్నారు. గ్రామంలోని యువత క్రీడాభివృద్ధిని ప్రోత్సహించే ఉద్దేశంతో ఆయన వాలీబాల్ క్రీడా సామగ్రిని యువకులకు అందజేశారు.
ఈ సందర్భంగా పండా సిద్ధార్థ దొర మాట్లాడుతూ, నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. యువత తమ విలువైన సమయాన్ని క్రీడలు, విద్య, సామాజిక సేవ వంటి సృజనాత్మక కార్యక్రమాలకు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.
క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఐకమత్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువతలో అనేక క్రీడా ప్రతిభలు ఉన్నాయని, వారికి సరైన ప్రోత్సాహం, అవసరమైన సదుపాయాలు కల్పిస్తే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని అన్నారు.
చెడు వ్యసనాలు యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉందని, వాటికి దూరంగా ఉండి క్రీడల ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని కోరారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.
ఈ సందర్భంగా వాలీబాల్ అందజేసినందుకు గ్రామ యువత పండా సిద్ధార్థ దొరకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో క్రీడా కార్యకలాపాలను మరింతగా ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని యువకులు పేర్కొన్నారు.

## మహిళ పై హత్యాయత్నం కేసులో నిర్లక్ష్యం వహించిన పోలీసులపై వేటు

- ఒక ఎస్సై, ముగ్గురు కానిస్టేబులను వి ఆర్ లో పెట్టిన ఎస్పీ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** గత నెల 25వ తేదీన పుట్టినరోజు వేడుకల పేరుతో నమ్మించి తీసుకెళ్లి, ఇద్దరు అన్నదమ్ములు ఆ మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించిన పోలీసులపై ఉన్నతాధికారులు వేటు వేశారు. కొరుకొండ మండలం పరిధిలోని గాడాల గ్రామానికి చెందిన మట్టడి అయ్యప్ప, మట్టాడి ప్రసాదులు అనే అన్నదమ్ములు రూరల్ మండలం బొమ్మూరుకు గ్రామానికి చెందిన గద్దం ధనలక్ష్మిని తల పై సుత్తితో తీవ్రంగా కొట్టి గాయపర చగా స్పృహ తప్పి పడిపోవడంతో మృతి చెందిందనే భావనతో 3 టౌన్ పరిధిలోని క్వారీ గోతుల్లో పడవేసిన సంగతి తెలిసిందే. 26వ తేదీ ఉదయాన ఆమె స్పృహ లోకి వచ్చి స్థానికుల, పోలీసుల సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించారు. ఈ సంఘటన గత నెల 25వ తేదీన జరిగితే, 26వ తేదీన ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ పోస్ట్ పోలీస్ స్టేషన్
పోలీసులు కోరుకొండ పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వని అవుట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ ఏ ఎస్ ఐ శ్రీదేవిని, స్టేషన్ పరిధిలో జరిగిన హత్య యత్నం కేసు నమోదులో నిర్లక్ష్యం వహించిన కోరుకొండ ఎస్సై రమేష్ ను, క్వారీ గోతుల పరిధి వచ్చే త్రి టౌన్ కు చెందిన హెడ్ కానే స్టబుల్ లక్ష్మణ్ , నాగ మల్లేశ్వర రావు ఇద్దరు పోలీసులను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వి ఆర్ కు పంపించామని నార్త్ జోన్ డీఎస్పీ సిహెచ్. జీవన తెలిపారు. బాలికలు మహిళల నేరాలు పట్ల ప్రభుత్వం ఉంటుందని నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరిస్తుందని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బంది పై శాఖ పర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 50వ వార్డులో పెన్షన్ల పంపిణీ చేసిన కాశీ నవీన్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 1:** స్థానిక 50వ వార్డులో నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ పాల్గొని లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, సామాజిక భద్రతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీన అర్హులకు పెన్షన్లు అందిస్తూదన్నారు. "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. క్షేమంతో పాటు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడమే ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.
ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ మరకుర్తి రవియాదవ్, చింతపల్లి నాని, నాగేంద్ర, సత్యనారాయణ, చౌదరి, సుజాతతో పాటు టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 1:** విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. ఇన్నీస్ పేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థులకు అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. తగిన వైద్య సలహాలు అందించడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యకర జీవన విధానం, సమతుల్య ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ శిబిరంలో ఆంత్రపాలజీ, వైటల్స్ నోమోగ్రామ్స్, అప్తమెట్రీ, ఆడియోమెట్రీ, జనరల్ పీడియాట్రిక్స్, డెంటిస్ట్రీ, సైకాలజీ వంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. చిన్నారులకు క్రమం తప్పకుండా ఇటువంటి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించ వచ్చున్నారు. ప్రారంభ దశలోనే ఆరోగ్య సమస్యలను గుర్తించి తగిన చికిత్స తీసుకోవడం ద్వారా అనారోగ్య తీవ్రతను తగ్గించవచ్చున్నారు. చిన్నపాటి అనారోగ్య లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట ఎంహెచ్ఓ వినూత్న, వైద్య సిబ్బంది ఉన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## విద్యుత్ సమస్యతో విలవిల లాడుతున్న రైతన్నలు...





**అడ్డతీగల,పెన్ పవర్,సెప్టెంబర్01;** ఏజెన్సీ రైతులకు విద్యుత్ సమస్య రైతులకు శాపంగా మారింది. అరకొర సరఫరాకు తీవ్ర లో వోల్టేజ్ కారణంగా సాగు మోటర్లు కాలిపోవడంతో మంగళవారం అడ్డతీగల మండలం తిమ్మాపురం, ఏలేశ్వరం మండలం మర్రి వీడు రైతులు అడ్డతీగల సబ్ స్టేషన్ ను ముట్టడించారు. అనంతరం రైతులు ఆందోళనకు దిగారు, గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో విద్యుత్ సక్రమంగా ఉండటం లేదని రైతులు ఆందోళనకు దిగారు, అయితే ప్రభుత్వ వ్యవసాయానికి అందిస్తున్న 9 గంటలకు ఉచిత విద్యుత్తు సక్రమంగా అందడం లేదని రైతులు వాపోయారు. ప్రభుత్వ వ్యవసాయానికి అందిస్తున్న 9 గంటలకు ఉచిత విద్యుత్తు సక్రమంగా అంతకపోవడంతో పంటలకు సాగునీరు అందించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, పంట సాగుకు బోర్లు పై ఆధారపడుతున్న రైతులు విద్యుత్ సమస్య మరింత భారంగా మారింది. కరెంటు సమస్యనుపరిష్కరించాలంటూవిద్యుత్కార్యాలయానికి వచ్చిన రైతులకు సంబంధిత ఏ.ఈ అందుబాటులో లేకపోవడంతో, ఫోన్లో సంప్రదించినట్లు తెలిపారు. సమస్య ఏలేశ్వరం పరిధిలో ఉందని అధికారులు చెప్పినప్పటికీ తమకు అడ్డతీగల సబ్స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా అవుతుందని రైతులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించకుండా, పరిధిలో పేరుతో తప్పించుకోవడం సరికాదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించి నోవోల్టే సమస్యను శాశ్వతంగా పరిష్కారం చూపడంతో పాటు, వ్యవసాయానికి నిర్ణీత సమయం మేరకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని రైతుల కోరుతున్నారు. విద్యుత్ సంస్థ పై నినాదాలు చేసి అనంతరం కార్యాలయ సిబ్బందికి మెమోరాడం అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతలపాటి. బుజ్జి రాజు.ఓలిపల్లి. శ్రీకాంత్.కొప్పిశెట్టి. సూరిబాబు.కలగా. వీరబాబు. సిరిపురపు. శ్రీను. రైతులు గ్రామస్తులు కూటమి నాయకులు భారీగా పాల్గొన్నారు.

## ఆదివాసి మహిళ శిరీష హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి



**చింతూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 1:**హైదరాబాద్లోని తుక్కుగూడలో ఆదివాసి మహిళ, ఏఎన్ఎంగా పనిచేస్తున్న ఉయిక శిరీషపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ సోమవారం చింతూరు మండల కేంద్రంలో ఆదివాసీ జేఏసీ, ఆదివాసీ గిరిజన సంఘం, ఉద్యోగ సంఘాలు, విద్యార్థుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ. ఉపాధి కోసం మారుమూల ప్రాంతాల నుంచి నగరాలకు వెళ్లే మహిళలకు పని ప్రదేశాల్లో రక్షణ లేకపోవడం ఆందోళనకరమన్నారు. శిరీషపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన అత్యంత దారుణమని, ఈ కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించి నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాలని కోరారు. ఈ ఘటన కేవలం ఒక ఆదివాసి మహిళపై జరిగిన దాడి మాత్రమే కాదని, సమాజంలోని మహిళల భద్రతపై తీవ్ర ప్రభావం చూపే ఘటనగా భావించి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని అన్నారు. శిరీష కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, హైదరాబాద్లోని ప్రైమ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యం సిబ్బంది భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. పని ప్రదేశాల్లో మహిళా సిబ్బందికి ప్రత్యేక విశ్రాంతి గదులు, తగిన భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలని కోరారు. శిరీష ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం తేలితే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాజంలో మద్యం, డ్రగ్స్ వినియోగంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, నగరాలు, పట్టణాల్లో పనిచేస్తున్న మహిళలకు పూర్తి రక్షణ కల్పించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సీసం సురేష్, ఆదివాసీ జేఏసీ నాయకులు జల్లి నరేష్, ఉద్యోగ సంఘాల నాయకులు బండా కృష్ణయ్య, తిమ్మ సాయి, మడివి రాధా, బొగ్గా ముత్తయ్య, మొట్టుమ్ రాజయ్య, పొడియం రామకృష్ణ, మడివి రాజు, మడకం రమేష్, బంధం రాములమ్మ, కాకా రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జగన్,కుమెగాడీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కులేదు.

- టిడిపిపార్టీమండలఅధ్యక్షులు బి.నరేష్,కుమార్

**వి.ఆర్.పురం పెన్.పవర్.సెప్టెంబర్. 1:** రాష్ట్రప్రభుత్వంప్రతిష్టాత్మకంగాచేపట్టిన,మెగా డీఎస్సీనియామక ప్రక్రియపై ప్రతిపక్షంనేత వై ఎస్ఆర్సిపిఅధినేత వై.యస్.జగన్మోహన్,రెడ్డి చేస్తున్నవిమర్శలు సరైనవి,కావని,ప్రభుత్వం అత్యంతపారదర్శక ంగానిర్వహిస్తుందని,చెప్తు న్నాకూడాఉపాధ్యాయ నియమాకాలపై,జగన్ చేస్తున్నఆరోపణలు కేవలం కూటమి ప్రభుత్వం పైబురద జల్లేప్రయత్నంకాదా?వై.సి.పి.ప్రభుత్వం ఐదేళ్లపరిపాలనలోఉద్యోగాల ఊసేఎత్తని,జగన్మో హన్,రెడ్డి,మెగాడీఎస్సీపైమాట్లాడే నైతిక హక్కు కూడాలేదని,వై.యస్.ఆర్.సిపిపార్టీ రాజకీయ లబ్ధికోసమేకూటమి ప్రభుత్వంపైబురదజల్లుతు న్నారని,మనరాష్ట్రముఖ్యమంత్రినారాచంద్రబా బునాయుడు,కూటమిప్రభుత్వంఅధికారంలోకి, రాగానేమొదటిసంతకం మెగాడీఎస్సీ ఫైల్ పైనే సంతకంపెట్టారని,నిరుద్యో గులకుఉద్యోగాలు వస్తుంటేఓర్వలేక జగన్ కేవలంతనరాజకీయ ఉనికిని,కాపాడుకో వడంకోసంఅబద్ధపు ప్రచా రాలుచేస్తున్నారని,నిరుద్యోగులభవిష్యత్తుకో సంప్రభుత్వంపారదర్శకంగానిర్వహిస్తున్న,ఉద్యో గాలభర్తీప్రక్రియను ,వివాదాస్పదంచేయ వద్దని, తప్పుడుప్రచారాలుమానుకోవాలని,టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్, హెచ్చ రించారు.ఈ కార్యక్రమంలోజడ్పిటిసి వాళ్ళరంగా రెడ్డి,ప్రధానకార్యదర్శి పాయం రామా



రావు,సొసైటీ చైర్మన్,గొందిచంద్రయ్య,మండల ఐటీడీపీ కన్వీనర్ భాగ్యలక్ష్మి,యూనిట్,ఇంచార్జ్,లు బీరక సూర్యప్ర కాష్,రావు,టిడిపిపార్టీసీనియర్,నాయకులు బొర్రా నరసింహారావు,కోట్లబాలయ్య,రేపుసింహా చలం,గొర్రె కృష్ణ,మడకంరాజు,ఆకోజురంగాచారి,తెల్లంఅప్పారావు, గొర్రె సీతారాములు,వెంకటేశ్వర్లు,బి సురేష్,గొర్రె రాము డు,టిడిపిపార్టీ,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అధికారుల నిర్లక్ష్యమే జాహ్నవి మరణానికి కారణమన్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

**టాయిలెట్స్,బాత్రూమ్స్,సిబ్బంది కొరత,కరెంట్,వాటర్ సమస్యలతో గిరిజన బాలికల పాఠశాల వసతులను మెరుగుపరిచి ప్రాణాలు బలికాకుండా చూడాలన్న ధనలక్ష్మి**





**కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్1.** కూనవరం మండలం కోతులగుట్ట లో ఉన్న ఏపీటీడబ్ల్యూఆర్ గురుకుల జూనియర్ కళాశాలలో 7వ తరగతి చదువుతున్న తెల్లం జాహ్నవి అనేవిద్యార్థిని వాంతులు, తలనొప్పితో బాధపడుతూ సకాలంలో వైద్యం అందక మృతి చెందింది.ఈ ఘటనపై గురుకుల అధికారులు,వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తీవ్ర ఆరోపణలు చేశారు.మంగళవారం ఆమె కూనవరం గురుకుల కళాశాలను సందర్శించి, విద్యార్థులు,ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రాథమిక వసతులే కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.బాలికల కళాశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో బయటి నుండి మూగజీవులు లోపలికి వస్తున్నాయి.వాటినితరిమేయడమే విద్యార్థుల పనిగా మారింది.720 మంది బాలికలకు కేవలం 20 బాత్రూములు మాత్రమే ఉన్నాయని,అంతమంది విద్యార్థులకు ఒకే ఒక ఏఎన్ఎం ఉంది.వంటకు ముగ్గురు మాత్రమే ఉండడంతో వారిపై పనిభారం విపరీతంగా పడుతుందని అన్నారు.కరెంటు,తాగునీరు, పనిచేసే సిబ్బంది లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.సిహెచ్సి ఆసుపత్రిలో డాక్టర్లు లేకపోవడం వల్లే పేద గిరిజన విద్యార్థుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని,దీనికి సంబంధిత అధికారులు,రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ధనలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి,గురుకులాల్లో వసతులు మెరుగుపరచి విద్యార్థుల ప్రాణాలను కాపాడాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గుజ్జా విజయ,కొమ్మాని సునీత,గుజ్జా బాబు,భరతమూర్తి, కరక రాజ్ కుమార్,వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు




- కాకినాడ రూరల్‌లో 'ఛలో పిఠాపురం' భారీ బైక్ ర్యాలీ..
- రామచంద్రపురంలోనూ జనసేన శ్రేణుల సన్నాహాలు

**కాకినాడ, పెన్ పవర్,సెప్టెంబరు 1:**జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సెప్టెంబరు 2న జనసేన శ్రేణులు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో 'ఛలో పిఠాపురం' పేరుతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. అదే విధంగా రామచంద్రపురం నియోజకవర్గంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు పార్టీ యువత సన్నాహాలు చేపట్టింది.

కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సెప్టెంబరు 2న ఉదయం 9 గంటలకు గుడారిగుంటలోని ఎమ్మెల్యే పంతం నానాజీ క్యాంపు కార్యాలయం నుంచి 'ఛలో పిఠాపురం' భారీ బైక్ ర్యాలీ ప్రారంభం కానుంది. ఈ ర్యాలీలో జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కార్యాలయం పిలుపునిచ్చింది.

పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రామచంద్రపురం నియోజకవర్గంలోనూ జనసేన యువత భారీ ర్యాలీకి సన్నాహాలు ప్రారంభించింది. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

రామచంద్రపురంలో ప్రతిపాదించిన బైక్ ర్యాలీ జనసేన పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమై రామచంద్రపురం మెయిన్ రోడ్డు, ఆర్టోస్ ఫ్యాక్టరీ, తాళ్లపాలెం, జగన్నాయకులపాలెం, గున్నయతూము, గాంధీ బొమ్మ సెంటర్, మసీదు సెంటర్, భీమేశ్వర స్వామి ఆలయం, ద్రాక్షారామ సెంటర్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కొనసాగనుంది.

పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రెండు నియోజకవర్గాల్లో జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాయి. ర్యాలీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించి శాంతియుతంగా కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# టెక్నాలజీ.. సృజనాత్మకతల కలయిక 'పోలీ వేద--2కె26

**పోలీ వేద - 2కె 26 పోస్టర్ విడుదల**

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 01:**గండేపల్లి మండలం, సూరంపాలెం లో గల ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల యందు ఇంజనీర్స్ డే సందర్భంగా ఈనెల 11,12 తారీఖులలో "పోలీ వేద–2కె26' పేరిట టెక్ ఫెస్ట్ నిర్వహించడం జరుగుతుంది అని ఆదిత్య కళాశాల వైస్ చైర్మన్ డా.ఎన్.సతీష్ రెడ్డి తెలియజేసారు. ఈ సందర్భంగా డా. సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఈ టెక్ ఫెస్ట్ కు సంబంధించిన క్యాంపెనింగ్ పోస్టర్ను రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, వి.ఎస్.వి.సి.హెచ్. శ్రీనివాస ప్రసాద్ విడుదల చేసినట్లు తెలియజేస్తూ "వేద" కు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్ విడుదల చేసిన వి.ఎస్.వి.సి.హెచ్. శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయడానికి ఆదిత్య చేస్తున్న కృషిని కొనియాడారు. పోస్టర్ రూపొందించిన ఎం. లీల సత్య ప్రవీణ్, (కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగం, మూడవ సంవత్సరం) ను అభినందించారు. ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా.ఎం. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల టెక్నికల్ నైపుణ్యాన్ని మెరుగు పరచడానికి మరియు నూతన ఆవిష్కరణలు ప్రోత్సహించడానికి "పోలీ వేద -2కె26" వేదిక అవుతుంది అని తెలియజేసారు. ఆదిత్య పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్.టి.వి.ఎస్. కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో, సాంకేతికత మరియు




సృజనాత్మకత మేళవింపుగా జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్రం మొత్తం మీద వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ తమ టెక్నికల్ ప్రాజెక్ట్ లతో పోటీ పడతారు అని, గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం కూడా అందజేయడం జరుగుతుంది అని తెలియజేసారు. ఈ సమావే శంలో డీన్ ఏ.వి. మాధవరావు, అసోసియేట్ డీన్ పొన్నాడ శ్రీనివాస్, వివిధ విభాగాలకు చెందిన విభాగాధిపతులు పాల్గొన్నారు.

## 'చాలా నమ్మకంగా ఉన్నా'.. టీమిండియాలోకి రీఎంట్రీపై రుతురాజ్ గైక్వాడ్ ధీమా

- పరుగులు చేయడంపైనే దృష్టి ఉందన్న సీఎస్‌కే కెప్టెన్
- నిలకడగా రాణించి టీమిండియా అవకాశం కోసం ఎదురుచూస్తానని వెల్లడి
- రషీద్-సూర్యవంశీ పోరుపై పెద్దగా ఆలోచించలేదని వ్యాఖ్య
- ఇప్పుడు మ్యాచ్‌లు ఎక్కువగా చూడడం లేదని వెల్లడి
- దేశవాళీ సీజన్‌పై రుతురాజ్ పూర్తి ఫోకస్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాలోకి తిరిగి రావడంపై భారత బ్యాటర్, చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ పూర్తి విశ్వాసంతో ఉన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో పరుగులు సాధిస్తూ తన స్థానాన్ని తిరిగి సంపాదించుకోవడంపైనే దృష్టి పెట్టినట్లు చెప్పాడు. అవకాశం వచ్చినప్పుడు సత్తా చాటేందుకు సిద్ధంగా ఉంటానని తెలిపాడు. టీమిండియాలోకి పునరాగమనంపై మంగళవారం కోయంబత్తూర్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా రుతురాజ్‌ను మీడియా ప్రశ్నించింది. దీనికి స్పందిస్తూ.. "చాలా నమ్మకంగా ఉన్నా. మళ్లీ వెళ్లి పరుగులు చేయడంపైనే దృష్టి. ఇన్నాళ్లూ పరుగులు సాధిస్తూనే ఉన్నా. ఇక నిలకడగా రాణిస్తూ అవకాశం కోసం ఎదురుచూడాలి" అని చెప్పాడు.

ప్రస్తుతం జాతీయ జట్టులో చోటు కోసం దేశవాళీ క్రికెట్‌లో రుతురాజ్ తనను తాను నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. తన బ్యాటింగ్‌పై నమ్మకం ఉందని స్పష్టం చేశాడు. దేశవాళీ సీజన్ మొదలుకానున్న నేపథ్యంలో రాబోయే టోర్నీలపై దృష్టి పెట్టినట్లు తెలిపాడు. ఇదిలా ఉంటే.. ఆఫ్ఘనిస్థాన్‌తో భారత్ తలపడనున్న నేపథ్యంలో రషీద్ ఖాన్, యువ భారత బ్యాటర్ సూర్యవంశీ మధ్య ఆసక్తికర పోరు ఉంటుందా? అని రుతురాజ్‌ను అడిగారు. అయితే ఈ పోరుపై తాను పెద్దగా ఆలోచించలేదని చెప్పాడు. "మీరు మీ దేశానికి మద్దతు ఇవ్వాలని కోరుకుంటారు.. నేనూ అంతే, నా దేశానికి మద్దతివ్వాలని కోరుకుంటాను" అని అన్నాడు.

జట్టులో లేనప్పుడు తాను మ్యాచ్‌లను ఎక్కువగా చూడనని తెలిపాడు. ప్రస్తుతం తన సాధనపైనే ఎక్కువగా దృష్టి పెట్టినట్లు రుతురాజ్ తెలిపాడు. ప్రాక్టీస్‌తో పాటు దేశవాళీ టోర్నీలు కూడా ఉండటంతో టీమిండియా మ్యాచ్‌లను రోజూ చూడటం సాధ్యం కావడం లేదన్నాడు.

దులీప్ ట్రోఫీ తర్వాత ఇరానీ కప్ జరగనుంది. ఆ తర్వాత రంజీ ట్రోఫీ, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టోర్నీలు ఉన్నాయి. ఈ టోర్నీల్లో రాణించి మరోసారి భారత జట్టులో చోటు దక్కించుకోవాలని రుతురాజ్ చూస్తున్నాడు.

# ఆఫ్ఘాన్ సిరీస్‌కు టీమిండియా ప్రకటన

## శ్రేయాస్‌కు కెప్టెన్సీ
## హార్దిక్‌కు చోటు దక్కలేదు
## వైభవ్ సూర్యవంశీకి అవకాశం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. శ్రేయాస్ అయ్యర్‌కు కెప్టెన్సీ అప్పగించగా.. హైదరాబాద్ క్రికెటర్ తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు జట్టులో చోటు దక్కలేదని సమాచారం. 15 ఏళ్ల యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి తొలిసారి అవకాశం లభించింది. గత సిరీస్‌ల్లో పెద్దగా ఆకట్టుకోని సంజు శాంసన్‌కు మరోసారి అవకాశం ఇచ్చారు. ఇషాన్ కిషన్ కూడా జట్టులో ఉన్నాడు. శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ తదితరులు జట్టులో చోటు దక్కించుకున్నారు. భారత్-ఆఫ్ఘనిస్తాన్ మధ్య టీ20 సిరీస్ సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభం కానుంది. మూడు మ్యాచ్‌లు సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనున్నాయి.

## నన్నే లైట్ తీసుకుంటారా.. ఇది నా స్టామినా! దులీప్ ట్రోఫీలో దుమ్ము రేపుతున్న షమీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా క్రికెట్ లో ఎంత టాలెంట్ ఉన్నప్పటికీ.. ఆటగాళ్లను ఎందుకు పక్కన పెడతారో ఒప్పటికీ అర్థంకాని ప్రశ్నే. ఫామ్ లో ఉన్నప్పటికీ.. ప్రూవ్ చేసుకుంటున్నప్పటికీ.. నెగ్లెక్ట్ చేయాలనుకుంటే ఎంత మొత్తుకున్నా.. ఫ్యాన్స్ నుంచి ఎంత డిమాండ్ వచ్చినా లైట్ తీసుకుంటారు. అలా బలైన ఆటగాళ్లలో షమీ ఒకరు. టీమిండియా సెలెక్టర్లు, కోచ్ లు పక్కన పెట్టినప్పటికీ.. తన టాలెంట్ ఏంటో, సత్తా ఏంటో చాటుతున్నాడు. ప్రస్తుతం దులీప్ ట్రోఫీలో ఆడుతున్న మహమ్మద్ షమీ.. తన పేస్ బౌలింగ్ తో దుమ్ము దులుపుతున్నాడు. బెంగళూరులో జరుగుతున్న సెమీఫైనల్ 1, డే3 మ్యాచ్ లో.. ఈస్ట్ జోన్ తరపున ఆడుతున్న షమీ తన అద్భుతమైన పేస్ తో సెంట్రల్ జోన్ ను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. దీంతో సెంట్రల్ జోన్ 8 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిపోయింది. ఈస్ట్ జోన్ తరపున షమీ కీలకమైన రెండు వికెట్లు పడగొట్టడంతో సెంట్రల్ జోన్ పతన ప్రారంభమైంది. ఆ తర్వాత మరో పేసర్ ముకేష్ కుమార్ నాలుగు వికెట్లు తీసుకోవడంతో మ్యాచ్ పై పట్టు సాధించారు.

స్ట్ ఇన్నింగ్స్ లో సెంట్రల్ జోన్ 266 రన్స్ చేసింది. లోయర్ ఆర్డర్స్ సపోర్ట్ తో రింకూ సింగ్ 60 రన్స్ తో పోరాటం చేసి స్కోర్ లో కీలక పాత్ర పోషించాడు. ఇక ఈస్ట్ జోన్ నుంచి చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ 81 బంతులలో 92 రన్స్ తో చెలరేగగా.. మరో ప్లేయర్ అభిమన్యు ఈశ్వరన్ 69 రన్స్ ఇద్దరూ కలిసి 161 రన్స్ భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో ఈస్ట్ జోన్ కూడా 266 రన్స్ చేయగలిగింది. సెంట్రల్ జోన్ నుంచి 4 వికెట్లు తీసుకుని హర్ష్? దుబే ఒక్కడే కొంత ప్రభావం చూపించాడు. ఇక సెకండ్ ఇన్నింగ్స్ లో షమీ, ముకేష్ కుమార్ దెబ్బకు 158 రన్స్ కే ఆలౌట్ అయ్యింది. దీంతో ఈస్ట్ జోన్ విజయం ఖాయం అని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

# తెలుగు సినిమాకు రూ.4 కోట్లు డిమాండ్ చేసిన మ్యాడీ







మలయాళి ముద్దుగుమ్మ మమితా బైజు ఒక్కసారిగా టాప్ ఆఫ్ ది సౌత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీ అయింది. ఈమె నటిగా ఇండస్ట్రీలో అనెడుగు పెట్టి దాదాపుగా పదేళ్లు అవుతుంది. అయితే గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు వరుస సక్సెస్‌లను సొంతం చేసుకుంది. 2024లో వచ్చిన ప్రేమలు సినిమాతో తమిళ్, తెలుగు భాషల్లోనూ పాపులారిటీ సొంతం చేసుకున్న మమితా బైజు తాజాగా విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాతో స్టార్ హీరోయిన్స్ జాబితాలో చేరి పోయింది. అందంతో పాటు అభినయం కావాలంటే మమిత బైజును తమ సినిమాల్లో ఎంపిక చేసుకోవాలి అనుకునే స్థాయికి ఆమె చేరింది అంటే ఆమె నటన గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాలో కొన్ని సీన్స్ లో ఏకంగా స్టార్ హీరో సూర్యను డామినేట్ చేసే విధంగా నటించింది అంటూ కొందరు రివ్యూల్లో రాసిన విషయం తెల్సిందే. అందుకే మమిత క్రేజ్ ఒక్కసారిగా పెరిగింది.

**మమిత బైజు వరుస హిట్స్...**

ఇన్నాళ్లు మలయాళ సినిమాలు మాత్రమే చేసిన మమిత బైజు గత ఏడాది కాలంగా పూర్తిగా తమిళ సినిమాలు మాత్రమే చేస్తూ వచ్చింది. ఎట్టకేలకు ఆమె ఒక మలయాళ సినిమాతోనూ వచ్చింది. 2026లో ఈమె నటించిన నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అన్ని సినిమాల్లోనూ ఈమె పోషించిన పాత్రకు మంచి మార్కులు పడ్డాయి. సూపర్ స్టార్ విజయ్‌తో కలిసి నటించిన జన నాయగన్ ఫలితం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఒరిజినల్ వర్షన్ లో శ్రీలీల పోషించిన పాత్రలో మమిత బైజు నటించిన విషయం తెల్సిందే. శ్రీలీల కంటే చాలా బెటర్‌గా మమిత బైజు నటించిందని, యాక్షన్ సీన్స్‌లోనూ వావ్ అనిపించింది అంటూ ప్రశంసలు కురిపించారు. ఇక విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాలోని మమిత బైజు నటన, చిలిపితనం, అందం ఇలా అన్ని విషయాలు పాజిటివ్ రెస్పాన్స్ దక్కించుకున్నాయి.

**కోలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు...**

మలయాళ సినిమాలు ఈమె తక్కువ కమిట్ కావడానికి కారణం పారితోషికం అనే వార్తలు వస్తున్నాయి. తమిళ్, తెలుగు సినిమాల పారితోషికాలతో పోల్చితే మలయాళ సినిమాల పారితోషికాలు దాదాపు సగం, అంతకంటే తక్కువగా ఉంటాయి. అందుకే మలయాళ సినిమాలు వస్తున్నప్పటికీ పారితోషికం ఇష్యూ కారణంగా నో చెబుతుంది అంటూ అక్కడి స్థానిక మీడియా మమితపై విమర్శలు చేస్తూ రాస్తున్నారు. తమిళంలో ఈమె ఒక్క సినిమాకు మొన్నటి వరకు రెండు కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడు విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమా విజయంతో ఆ పారితోషికం ఏకంగా రూ.3 కోట్లకు పెరిగిందని తెలుస్తోంది. తమిళ్‌లో ఈమె ఇటీవల ఒక సినిమాకు సైన్ చేసిందని, అందుకు గాను రూ.3 కోట్ల పారితోషికం ఒప్పందం జరిగిందని తమిళ మీడియా కథనాలు వచ్చాయి. మమిత ఇప్పటి వరకు తెలుగు సినిమా సైన్ చేయలేదు.

**టాలీవుడ్ మూవీలో మమిత బైజు...**

ఒక స్టార్ హీరో సినిమాలో మమిత ను హీరోయిన్‌గా నటింపజేయడం కోసం సంప్రదించారని తెలుస్తోంది. మమిత అందుకు ఓకే చెప్పిందట, కానీ పారితోషికం గా రూ.4 కోట్లు కావాలంటూ డిమాండ్ చేసిందని తెలుస్తోంది. ఇప్పటి వరకు పారితోషికం విషయంలో తుది చర్చలు జరగలేదని, మమిత కాస్త తగ్గించుకుంటే నిర్మాతలు ఆమెకు అడ్వాన్స్ ఇస్తారని ఇండస్ట్రీ వర్గాల నుంచి సమాచారం అందుతోంది. టాలీవుడ్‌లో హీరోయిన్స్ కి భారీ పారితోషికం ఇవ్వడం ఈ మధ్య కాలంలో ఎక్కువగా జరుగుతుంది. కనుక తమిళ్ లో రూ.3 కోట్లకు ఓకే చెప్పిన మమిత, తనకు ఉన్న క్రేజ్, టాలీవుడ్ లో ఉన్న ఆనవాయితీ కారణంగా రూ.4 కోట్ల పారితోషికం డిమాండ్ చేసి ఉంటుందని అంటున్నారు. టాలీవుడ్‌లో సాలిడ్ హిట్‌తో ఎంట్రీ ఇస్తే మమితకు అంతకు మించిన పారితోషికం దక్కినా ఆశ్చర్యం లేదు. ఇంతకు మమిత ఏ హీరోతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వబోతుంది అనేది తెలియాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965